


షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక
RNI : APTEL / 2023 / 89152

సంపుటి : 2 సంచిక : 47 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 8 జనవరి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 02 ISSUE : 47 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 8 january 2025 PAGES : 8 PRICE : 5/-




## ఒక ప్లాన్ ప్రకారం ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేస్తున్నారు

మీకు ఆ ఉద్దేశం ఉంది కాబట్టే నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఇవ్వాల్సిన బకాయిలు నిలిపేశారు: జగన్

ఆరోగ్య శ్రీ బకాయిలు రూ.3 వేల కోట్లు ఆపేశారన్న జగన్

చంద్రబాబు గారూ ఆరోగ్య శ్రీపై మీకు ఎందుకింత కక్ష అంటూ ఆగ్రహం

**విజయవాడ**

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చంద్రబాబు గారూ ఆరోగ్య శ్రీపై మీకు ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఒక ప్లాన్ ప్రకారం ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేసిన మాట వాస్తవం కాదా? అని నిలదీశారు. మీకు ఆ ఉద్దేశం ఉంది కాబట్టే ఆరోగ్య శ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులకు ఇవ్వాల్సిన రూ.3 కోట్లను బకాయి పెట్టారని ఆరోపించారు. "ఆసుపత్రులకు వెళితే ఆరోగ్య శ్రీ లేదనే మాట వినిపిస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఈ ఎనిమిది నెలల కాలంలో ప్రజలు అప్పులు చేసి, ఆస్తులు తాకట్టు పెట్టి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి ఎందుకు వచ్చింది? ప్రజల ఆస్తిగా వైసీపీ సృష్టించిన 17 వైద్య కళాశాలలను - మిగతా3లో


# టూరిస్ట్ హబ్‌గా కుప్పం



- మరో పార్టీ సింబల్ తెలియని నియోజకవర్గం నాది: సీఎం చంద్రబాబు
- కుప్పంలో చంద్రబాబు రెండో రోజు పర్యటన
- తనపై మూడు బాధ్యతలు ఉన్నాయని వెల్లడి
- టీడీపీ కార్యకర్తలను ఎంటర్ ప్రెన్యూర్లుగా తయారుచేస్తామని వ్యాఖ్యలు
- అప్పుడప్పుడు వెతుక్కుంటూ కుప్పం వస్తారు
- వివిధ నిర్మాణాలకు శంకుస్థాపన.. అనంతరం 'స్వర్ణ కుప్పం' సభకు హాజరు
- కుప్పం వచ్చే ప్రజల ఆయుష్షు పెరిగేలా చర్యలు తీసుకుంటామన్న చంద్రబాబు
- 2047 నాటికి కుప్పంను దేశంలోనే ఆదర్శ నియోజకవర్గం చేస్తామని వెల్లడి

**కుప్పం**

గత ఐదేళ్లలో ధ్వంసమైన వ్యవస్థలను గాడిలో పెడుతున్నానని, ఓట్లేసి గెలిపించిన ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజలందరికీ సుపరిపాలన అందించడమే లక్ష్యంగా జన నాయకుడు పోర్టల్ ను రూపొందించామని, మొదట కుప్పంలో దీన్ని అమలు చేసి, ఆపై రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ అందుబాటులోకి తెస్తామని చెప్పారు .సీఎం చంద్రబాబు కుప్పం పర్యటన నేడు రెండో రోజు కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....కుప్పం ప్రజల రుణం తీర్చుకోలేనని అన్నారు. తనను 8 సార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని, ఈ నియోజకవర్గ ప్రజలకు సైకిల్ గుర్తు తప్ప మరో పార్టీ సింబల్ తెలియదని, తనపై మొదటి నుంచి నమ్మకం చూపిస్తున్నారని అన్నారు. మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో మరో పార్టీ జెండా ఎగరలేదని వెల్లడించారు. రాబోయే ఐదేళ్లలో కుప్పాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా స్వర్ణ కుప్పం విజన్ -2029కి రూపకల్పన చేశామని, ఇప్పుడు కుప్పం ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించి న్యాయం చేయడం కోసం జన నాయకుడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చంద్రబాబు వివరించారు. నాపై మూడు బాధ్యతలున్నాయి నేను పార్టీ అధ్యక్షుడిని. కుప్పం ఎమ్మెల్యేని. రాష్ట్ర ముఖ్యమంత్రిని. నాపై మూడు రకాల బాధ్యతలు ఉన్నాయి. ఎన్నికల - మిగతా3లో




## మోగిన నగారా

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన ఈసీ
- ఈవీఎంల గురించి సమాధానం ఇచ్చిన తర్వాత కూడా కొందరు ఈవీఎంల అవకతవకలపై మాట్లాడుతున్నారు
- ఈవీఎంలలో వైరస్, బగ్ కానీ, చెల్లని ఓట్లు కానీ ఉండవు
- రిగ్గింగ్‌కు అవకాశం లేదు
- ఇండియాలో 99 కోట్ల రిజిస్టర్డ్ ఓటర్లు ఉన్నారు
- ఓటింగ్, మహిళా పార్టిసిపేషన్‌లో ఎన్నికల సంఘం కొత్త రికార్డులు సృష్టించింది
- త్వరలో 100 కోట్ల రిజిస్టర్డ్ ఓటర్లతో సరికొత్త రికార్డు నమోదు కానుంది

## పుస్తకాల బరువు తగ్గించండి...
# నాణ్యత పెంచండి!

- స్కూలు, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యపై మంత్రి లోకేశ్ సమీక్ష
- ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ లక్ష్యంగా సంస్కరణలపై చర్చ
- ఉన్నత విద్యలో క్యూఎస్ ర్యాంకింగ్స్ లక్ష్యంగా మార్పులు
- కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యప్రణాళిక ప్రక్షాళనకు కసరత్తు



**విజయవాడ**

పాఠశాల విద్య స్థాయిలో బాలలకు పుస్తకాల భారం తగ్గించి నాణ్యత పెంచేలా నూతన పాఠ్య ప్రణాళిక రూపొందించాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. 2025-26 విద్యాసంవత్సరంలో కేజీ నుంచి పీజీ వరకు పాఠ్యప్రణాళిక సమూల ప్రక్షాళనపై పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, ఉన్నత విద్య శాఖాధికారులతో మంత్రి లోకేశ్ ఉండవల్లి నివాసంలో 4 గంటలకు పైగా సుదీర్ఘంగా సమీక్షించారు. ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ లక్ష్యంగా సంస్కరణలు చేపట్టాలని అన్నారు. స్కూలు ఎడ్యుకేషన్ లో జీవో నెం. 117కు ప్రత్యామ్నాయం విషయంలో ఎమ్మెల్యేలు, స్కూలు మేనేజ్ మెంట్ కమిటీల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్లేస్కూలు పాలసీపై కూడా సమావేశంలో చర్చసాగింది. పాఠ్యాంశాల్లో నైతికవిలువల అంశాలను ప్రవేశపెట్టడంతోపాటు సెమిస్టర్ వైజ్ గా వేర్వేరు టెక్స్ట్ బుక్స్ కాకుండా ఒకే పుస్తకాలు రెండుసెమిస్టర్ల పాఠ్యాంశాలు ఉండేలా రూపొందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. దీనివల్ల పాఠశాల విద్యార్థులకు పుస్తకాల భారం తగ్గించవచ్చని సూచించారు. ఎటువంటి విమర్శలకు తావీయకుండా పారదర్శకంగా డిఎస్సీని నిర్వహించేలా చర్యలు - మిగతా3లో




## ఫాస్టాగ్ తప్పనిసరి..!

- అక్కడ ఏప్రిల్ 1 నుంచి అన్ని వాహనాలకు ఫాస్టాగ్ తప్పనిసరి..!
- వాహనానికి ఫాస్టాగ్ అంటించి ఉంటే టోల్ ప్లాజాల దగ్గర ఆగాల్సిన అవసరం ఉండదు.
- అందరూ ఫాస్టాగ్‌లను తీసుకోకపోవడంతో పూర్తిగా రద్దీ తగ్గడం లేదు.
- అన్ని వాహనాల యజమానులు ఫాస్టాగ్‌లను తీసుకోవడం తప్పనిసరి చేసింది.



## సీఎం నివాసం నుంచి నన్ను మళ్లీ గెంటేశారు

- అతిషి సంచలన వ్యాఖ్యలు
- అవసరమైతే ఢిల్లీ ప్రజల ఇళ్లకు వెళ్లి అక్కడ ఉండటానికి కూడా తాను సిద్ధమే
- బీజేపీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం నన్ను సీఎం నివాసం నుంచి సోమవారం రాత్రి గెంటేసింది
- ఇలా జరగడం గత మూడు నెలల్లో ఇది రెండోసారి
- ఇళ్లు లాక్కోవడం, మాపై బురదచల్లడం, కుటుంబ సభ్యులపై నిందలు వేయడం వంటి పనులతో మమ్మల్ని పనిచేయకుండా చూడాలనేది బీజేపీ ఆలోచనగా ఉంది.

# ఇరిగేషన్ శాఖ అధికారులకు గుడ్ న్యూస్

- గత జగన్ ప్రభుత్వ హయాంలో.. సంక్షేమంపై దృష్టి పెట్టారు
- దీంతో రాష్ట్రాభివృద్ధిని అంతగా పట్టించుకోలేదు.
- రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేకుండా పోయింది
- గత జగన్మోహన్ రెడ్డి తుగ్లక్ పాలన ఫలితంగా అన్ని శాఖల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారు
- అడ్‌హాక్ పదోన్నతులకు ఉన్న అడ్డంకులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

**అమరావతి**

సమస్యలను పరిష్కరించి.. అడ్‌హాక్ పదోన్నతులకు ఉన్న అడ్డంకులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని ఇరిగేషన్ శాఖ అధికారులకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు భరోసా ఇచ్చారు. మంగళవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి నిమ్మల రామానాయుడిని ఇరిగేషన్ ఇంజనీర్స్ అసోసియేషన్ సభ్యులు కలిశారు. గత ప్రభుత్వ హయాంలో పదోన్నతులు లేక ఎంతో నష్టపోయామని మంత్రి రామానాయుడు దృష్టికి వారు తీసుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో మంత్రి నిమ్మల రామానాయుడు పైవిధంగా స్పందించారు. గత జగన్మోహన్ రెడ్డి తుగ్లక్ పాలన ఫలితంగా అన్ని శాఖల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారని ఆయన పేర్కొన్నారు. దీనిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని చెప్పారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా డీఈ స్థాయి నుంచి సీఈ స్థాయి వరకు వందల సంఖ్యలో ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లు లబ్ధిపొందనున్నారు. గత జగన్ ప్రభుత్వ హయాంలో.. సంక్షేమంపై దృష్టి పెట్టారు. దీంతో రాష్ట్రాభివృద్ధిని అంతగా పట్టించుకోలేదు. దాంతో బటన్ నొక్కే - మిగతా3లో



# టూరిస్ట్ హబ్‌గా కుప్పం

-మొదటిపేజీ తరువాయి

సమయంలో టీడీపీ కార్యకర్తలు మేమిచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓట్లేయించారు. పార్టీ అధ్యక్షుడిగా ఆ హామీలు నెరవేర్చాల్సిన బాధ్యత నాపై ఉంది. అలాగే కుప్పం ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజల బాగోగులు నేను చూసుకోవాలి. స్థానికులు వారి సమస్యలపై వినతి పత్రాలు ఇచ్చేందుకు వీలుగా జన నాయకుడు పోర్టల్ తీసుకొచ్చాం. ఇక్కడ నా పీఏ, కడా అధికారులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారు. నేను ఎమ్మెల్యేగా చేయాల్సిన బాధ్యతలను వారు నాకు ఎప్పటికప్పుడు తెలియజేస్తుంటారు. తద్వారా బాధితుల సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తాను.

ఇక ప్రభుత్వ సమస్యలన్నీ %గా+=వా%కు వెళతాయి. గ్రీవెన్స్ , భూ సమస్యలు, సీఎంఆర్ఎఫ్ వంటివి ప్రభుత్వం చూస్తుంది. టీడీపీ కార్యకర్తలను ఎంటర్ ప్రెన్యూర్లుగా తయారుచేస్తాం పార్టీని తమ భుజాలపై మోస్తున్న కార్యకర్తలను ఎంటర్ ప్రెన్యూర్లు గా తయారుచేస్తాం. టీడీపీ సభ్యత్వాలు కోటికి చేరువగా రావడం సంతోషాన్నిస్తోంది. టీడీపీకి కార్యకర్తలే బలం. కష్ట సమయంలో పార్టీకి అండగా నిలబడ్డ కార్యర్తలను కుటుంబసభ్యుల్లా చూసుకుంటున్నాము. ప్రతి కార్యకర్తకు రూ. 5 లక్షల ప్రమాద బీమా అందిస్తున్నాము. వారి పిల్లల చదువులు, ఉద్యోగ, ఉపాధికి ఆర్థిక చేయూత అందిస్తున్నాము. పార్టీకి సేవ చేసిన వారందరికీ న్యాయం చేస్తాము. పార్టీ కార్యకర్తలకు ఆమోదయోగ్యమైన వారికే పదవులు ఇస్తాము.

### వ్యవస్థలను నాశనం చేసి పోయారు

గత పాలకులు రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారు. అప్పులకుప్పగా రాష్ట్రాన్ని మార్చేశారు. అరాచక పాలనను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధించారు. జైలు పాల్జేశారు. చివరకు మీడియా ప్రతినిధులపైనా కేసులు పెట్టారు. ఒక ఆర్డర్ తెచ్చి మీడియాపై కేసులు ఎత్తేస్తాం. భూములకు సంబంధించిన ఫైళ్లన్నీ తారుమారు చేసిన ఘనులు వైసీపీ నేతలు. భూములను కబ్జా చేసేశారు. రెవెన్యూ సదస్సుల్లో ఆ దస్త్రాలన్నింటినీ సరిదిద్దుతున్నాం. యువతకు ఉపాధి కల్పించేందుకు పరిశ్రమలు తీసుకొస్తున్నాం. రాష్ట్రంలో కరవును పారద్రోలి, నీటి భద్రత కల్పించేందుకు గోదావరి పెన్నా నదుల అనుసంధానానికి శ్రీకారం చుట్టాము. గోదావరి జలాలను రాయలసీమకు తీసుకొస్తాను. ఆపై కుప్పానికీ నీరు అందిస్తాను. అలాగే హంద్రినీవా పనులను జూన్ కల్లా పూర్తి చేసి కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొస్తాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.

### అప్పుడందరూ వెతుక్కుంటూ కుప్పం వస్తారు

సొంత నియోజకవర్గం కుప్పంలో సీఎం చంద్రబాబు పర్యటన నేడు రెండో రోజు కూడా కొనసాగింది. కుప్పంలో పలు నిర్మాణ పనులకు చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మదర్ డెయిరీ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణాల భూమిపూజలో పాల్గొన్నారు. కడా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేశారు. వివిధ కంపెనీల ప్రతినిధులతోనూ సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు.

అనంతరం ఏర్పాటు చేసిన 'స్వర్ణ కుప్పం' సభలో చంద్రబాబు ప్రసంగిస్తూ... రానున్న 23 ఏళ్లలో కుప్పం భారతదేశంలోనే ఒక ఆదర్శ నియోజకవర్గంలా ఉండాలని అన్నారు. ఎవరన్నా చదువుకోవాలంటే బెంగళూరుకు వెళ్లడం కాదు, కుప్పానికి రావాలి... అలాంటి విద్యాసంస్థలను ఇక్కడికి తీసుకువస్తామని వివరించారు.

ఇవన్నీ కాకుండా, అత్యంత నివాసయోగ్యమైన ప్రదేశంగా కుప్పంను తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. కుప్పానికి వచ్చే



ప్రజలకు ఆరోగ్యం పెరగాలి... సాధారణంగా బెంగళూరు కంటే కుప్పం వచ్చే వాళ్లకు 20-30 ఏళ్లు ఎక్కువగా ఆయుష్షు పెరిగే పరిస్థితి వస్తే... అప్పుడందరూ వెతుక్కుంటూ కుప్పానికి వస్తారు అని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అంత పరిశుభ్రమైన ప్రాంతంగా కుప్పంను తయారు చేస్తాం అని స్పష్టం చేశారు. అందుకు మీ అందరి సహకారం అవసరం అని అన్నారు. అంతేగాకుండా, కుప్పంను ఒక టూరిస్ట్ హబ్ గా మార్చుతామని, వీకెండ్ లో బెంగళూరు నుంచి ఇక్కడికి వచ్చేలా చేస్తామని చెప్పారు. ఇక, నిడమూరులో ఇళ్లపై సోలార్ కరెంటు ఉత్పత్తికి శ్రీకారం చుట్టామని తెలిపారు. రాష్ట్రంలో 20 లక్షల ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో ప్రకృతి సేద్యం బాగా విస్తరించాల్సిన అవసరం ఉందని, ప్రకృతి సేద్యం ద్వారా పండించిన ఉత్పత్తులకు మంచి ధర వస్తుందని అన్నారు. మైక్రో కిరాణా దుకాణాల యజమానులకు లాభాలు రావాలని ఆకాంక్షిస్తున్నట్టు చంద్రబాబు తెలిపారు. టాటా సంస్థ సహకారంతో అందరికీ అధునాతన వైద్య చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

### కుప్పంలో జన నాయకుడు పోర్టల్ ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఇవాళ ఆయన కుప్పం టీడీపీ కార్యాలయానికి వచ్చారు. జన నాయకుడు పోర్టల్ ను, సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. కుప్పం ప్రజలు తమ సమస్యలపై జన నాయకుడు కేంద్రంలో వినతిపత్రాలు అందించవచ్చు. ఈ కేంద్రంలోని సిబ్బంది ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటిని ఆన్ లైన్ లో నమోదు చేస్తారు. ఆ సమస్యలు పరిష్కారం అయ్యాక ఆ వివరాలను ఆన్ లైన్ లో పొందుపరుస్తారు. నేడు ఈ జన నాయకుడు కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు... పనితీరును పరిశీలించారు. జన నాయకుడు కేంద్రం ప్రస్తుతానికి పైలట్ ప్రాజెక్టుగా కుప్పంలో అమలు చేస్తున్నారు. దీని పనితీరు ఆధారంగా, త్వరలో రాష్ట్రవ్యాప్తం చేయనున్నారు.

### నేరుగా ముఖ్యమంత్రి పరిశీలించేలా...

ప్రతి అర్జీ, పరిష్కారం ఎంత వరకు వచ్చిందనేది నేరుగా సీఎం చూసేలా జన నాయకుడు పోర్టల్ లో డాష్ బోర్డ్ కూడా ఏర్పాటు చేశారు. దీన్ని బట్టి సమస్యలు సత్వరం పరిష్కారం అవుతున్నాయా...లేదా అన్నదాన్ని సీఎం ప్రత్యక్షంగా చూడొచ్చు. నేరుగా జన నాయకుడు కేంద్రానికి రాలేని వాళ్ల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నంబర్ కూడా ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా జన నాయకుడు పోర్టల్ లో నమోదైన సమస్యల పరిష్కారంపై కాల్ సెంటర్ నుంచి అర్జీదారులకు ఫోన్ చేసి వారి అభిప్రాయం కూడా తీసుకుంటారు. సంతృప్తిగా ఉన్నారా...అసంతృప్తిగా ఉన్నారా...అసంతృప్తిగా ఉంటే దానికి గల కారణాలను తెలుసుకుంటారు. మీడియాలో వచ్చే ప్రజాసమస్యలను కూడా గుర్తించి సూమోటోగా జననాయకుడు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

### గన్నవరం ఎయిర్ పోర్టును కూచిపూడి థీమ్ తో ఆధునికీకరణ: సీఎం చంద్రబాబు

నన్ను గుండెల్లో పెట్టుకుని ఇంతవాణ్ణి చేసిన కుప్పం ప్రజల రుణం తీర్చుకునేందుకే స్వర్ణ కుప్పం విజన్ - 2029 డాక్యుమెంట్ రూపొందించానని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.. పేదరిక నిర్మూలన, పరిశ్రమలు, ఉద్యోగ కల్పన, నైపుణ్య శిక్షణా కేంద్రాలు, అందరికీ విద్య వంటి 10 అంశాలకు విజన్ డాక్యుమెంటులో ప్రాధాన్యత ఇచ్చాం' అని వివరించారు. కుప్పం రెండో రోజు పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడంతో పాటు వివిధ కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడారు.

### కుప్పంలో కార్గో ఎయిర్ పోర్టు రాబోతోంది

కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేస్తున్న 'కడ' అధికారులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను. కుప్పాన్ని టూరిజం హబ్ గా మారుస్తా. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అందులో భాగంగా గన్నవరం ఎయిర్ పోర్టును కూచిపూడి నృత్యం థీమ్‌తో ఆధునీకరిస్తున్నాము. కుప్పం ప్రజలు కాలుష్యానికి దూరంగా ఆరోగ్యంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నాను. కుప్పంలో కార్గో ఎయిర్ పోర్టు రాబోతోంది. ఇక్కడి ప్రజలకు అత్యాధునిక వైద్యాన్ని అందించేందుకు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి తీసుకొస్తున్నాము. టాటా సంస్థ సహకారంతో మెరుగైన వైద్య సేవలు అందిస్తాం.

### కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.92 కోట్లు

మరో మూడు నెలల్లో కుప్పానికి వస్తాను. కడా ఆధ్వర్యంలో కుప్పంలో చేపట్టే అభివృద్ధి పనులను నేను స్వయంగా పర్యవేక్షిస్తాను. కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.92.22 కోట్లు మంజూరు చేశాము. అందులో రూ. 22 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి చేస్తాము. గత ఐదేళ్లు ఈ ప్రాంగణాన్ని అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చారు. రూ.20 కోట్ల వ్యయంతో కుప్పంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటుచేస్తాం. రూ.10 కోట్ల వ్యయంతో కుప్పంలో 10 జంక్షన్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రధాన రహదారులను సుందరీకరిస్తాము. విద్యుత్ దీపాల ఏర్పాటుకు రూ.3 కోట్లు మంజూరు చేశాం. రూ.19 కోట్ల వ్యయంతో పార్కులను అభివృద్ధి చేయబోతున్నాము. కుప్పం నియజకవర్గంలో గుంతల రోడ్లు కనపడకూడదు. రహదారుల అభివృద్ధి, మరమ్మతుల కోసం రూ. 34.27 కోట్లు మంజూరు చేశాం. శాంతిపురం పరిధిలో మదర్ డెయిరీకి 41 ఎకరాల 21 సెంట్లు ఇచ్చాము. రూ. 105 కోట్ల వ్యయంతో రాబోతున్న ఈ డెయిరీ వల్ల 4 వేలమందికి ఉద్యోగాలు వస్తాయి. అలాగే శ్రీజ మహిళా మిల్క్ సంస్థ ఏర్పాటుతో మరో 4 వేల ఉద్యోగాలు రాబోతున్నాయి. కుప్పం పరిధిలో రూ.22 కోట్ల వ్యయంతో ఆలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశాం. డ్వాక్రా ఏర్పాటు చేసి మహిళల ఆర్థిక స్వావలంబనకు బాటలు వేశాను. ఇప్పుడు కుప్పం నియోజకవర్గంలో అలీప్ సంస్థ సహకారంతో మహిళలకు పలు ఉత్పత్తుల తయారీలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తాం... అని చంద్రబాబు వివరించారు.

# మొదలైన మోడీ గేమ్...

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ లో నరేంద్ర మోదీ గేమ్ మొదలయినట్లే కనిపిస్తుంది. నరేంద్ర మోదీని ఆషామాషీగా అనుకోవడానికి వీలులేదు. ఆయన దూర దృష్టితో ఆలోచించి ఏ రాజకీయ నిర్ణయమైనా ఉంటుంది. అంతే తప్ప తాత్కాలికంగా ఎటువంటి డెసిషన్లు ఉండవు. అదే సమయంలో మనతో మోదీ అనుకూలంగా ఉన్నారనుకోవడం కూడా అంతే తప్పు అవుతుంది. ఎందుకంటే తనకు ఇబ్బందిగా మారతారనుకున్న వారిని మోదీ కట్టడి చేయడానికే ఎక్కువ ప్రయత్నం చేస్తారన్నది దాదాపు దశాబ్దన్నర జాతీయ రాజకీయాలు చూసిన వారికి ఎవరికైనా ఇలాగే తెలుస్తుంది. మొన్న జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి ఆశించిన స్థాయిలో సీట్లు రాలేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఆధారపడాల్సి వచ్చింది. ఆయన పైకి ఇద్దరితో నవ్వుతూ కనిపించినప్పటికీ లోలోపల మాత్రం ఇద్దరినీ రాజకీయంగా కొంత అణిచివేసే ప్రయత్నం చేస్తారన్నది రాజకీయ వర్గాల్లో సాగుతున్న విశ్లే?షణలు బట్టి అర్థమవుతుంది. అందులోనూ చంద్రబాబు లాంటి సీనియర్ నేతను కంట్రోల్ చేయడం మోదీకి అవసరం అని మోదీ ఖచ్చితంగా భావిస్తారు. చంద్రబాబు నిజానికి మోదీ కంటే సీనియర్ నేత. రాజకీయాల్లో మోదీతో పా?టు ఆయన ముఖ్యమంత్రి అయ్యారు. అయితే అనేకసార్లు బీజేపీతో పొత్తు పెట్టుకోవడం తెగదెంపులు చేసుకోవడం ఆయనకు అలవాటు. నితీష్ కుమార్ కూడా అంతే. అందుకే ఇద్దరు సీనియర్ నేతలను మోదీ నమ్మే అవకాశమే లేదు. అందుకే జమిలి ఎన్నికలకు వెళ్లినా వీరిద్దరి విషయంలో ఒకింత జాగ్రత్త పడతారంటున్నారు. బీహార్, ఆంధ్రప్రదేశ్ లలో ఒకింత ఇద్దరు నేతల గ్రిప్ ను తగ్గించేందుకు మోదీ ప్రయత్నిస్తారన్నది తెలుగుదేశం పార్టీ నేతలు సయితం అనుమానిస్తున్నారు. తనను శాసించే పరిస్థితిని మోదీ తెచ్చుకోరు. తన చేయి పైన ఉండాలని, తనను ఒకరు యాచించాలి తప్ప డిమాండ్ చేయడం మాత్రం ఆయన సహించలేరన్నది మోదీ నైజం తెలిసిన వారు ఎవరైనా



ఒప్పుకునే విషయం. అందుకే ఈ ఇద్దరు సీనియర్ నేతలైన నితీష్ కుమార్, చంద్రబాబుల విషయంలో మోదీ ఇప్పటికే స్కెచ్ వేసి ఉంటారన్నది భావిస్తున్నారు. వారిని రాజకీయంగా కొంత బలహీనం చేయగలిగితేనే పది కాలాల పాటు పాలన సాగించవచ్చన్న ఆలోచన సహజంగానే మోదీలో ఉంటుందని చెబుతున్నారు.అందులో భాగంగానే పవన్ కల్యాణ్ ను ఆంధ్రప్రదేశ్ లో హైలెట్ చేయాలని మోదీ భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ కొంతకాలం ఢిల్లీ పర్యటన ముగించుకుని వచ్చిన వెంటనే కాకినాడ పోర్టు పైన పడటం కూడా ఒకింత ఢిల్లీ వ్యూహమేనన్న వారు కూడా లేకపోలేదు. అయితే అందులో నిజమెంత? అన్నది పక్కన పెడితే.. చంద్రబాబు గతంలో మాదిరిగా మోదీని డిమాండ్ చేయలేరు. ఎందుకంటే ఏపీలో పవన్ అవసరం చంద్రబాబుకు ఉంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మరోసారి పవన్ తో కలసి ప్రయాణం చేస్తేనే అధికారం దక్కుతుంది. ఆ వీక్ నెస్ తోనే పవన్ ను మోదీ మంచి చేసుకుంటున్నారు. వీలయినప్పుడల్లా పవన్ ను పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. పవన్ కల్యాణ్ కు ఢిల్లీ స్థాయిలో ఒక రోడ్ మ్యాప్ ను కూడా రూపొందించే అవకాశాలున్నాయి. వచ్చే ఎన్నికల నాటికి పవన్ కల్యాణ్ అత్యధిక స్థానాలను కోరే ఛాన్స్ తో పాటు సీఎం సీటు షేరింగ్ విషయంపై కూడా ఒప్పందం చేసుకోవాలన్న ప్రతిపాదన తీసుకు వచ్చినా ఆశ్చర్యం లేదన్నది రాజకీయవర్గాల అంచనాగా వినిపిస్తుంది. చంద్రబాబు రాజకీయ చాణక్యుడు అయితే.. మోదీ అంతకు మించి. చంద్రబాబు భయం కూడా అదే. మోదీని వదిలి పవన్ బయటకు రారు. అలా ఫిక్స్ చేయడంలో నరేంద్ర మోదీ ఇప్పటికే సక్సెస్ అయినట్లు ఏపీ రాజకీయాలు పరిశీలించిన వారికి ఎవరికైనా అర్థమవుతుంది. మొత్తం మీద దక్షిణాదిలో పట్టు పెంచుకోవాలంటే ఏపీలో గ్రిప్ సంపాదించాలన్న మోదీ ఆలోచనతో పవన్ కు రానున్న కాలంలో మరింత ప్రయారిటీ ఇస్తారన్న అంచనాలు వినపడుతున్నాయి. రేపు ఎనిమిదోతేదీన విశాఖ పర్యటనలో కూడా మోదీ పవన్ కు ప్రాధాన్యత ఇచ్చే అవకాశాలున్నాయిఅందుకేచంద్రబాబు నాయుడు పెద్దగా రాష్ట్ర ప్రయోజనాల విషయంలో డిమాండ్ చేయలేని పరిస్థితి ఉంది. కూటమితోనే వచ్చే ఎన్నికలకు వెళ్లాలన్న ఆలోచనలో ఉన్న చంద్రబాబు ఈసారి మాత్రం పవన్, మోదీలను దూరం చేసుకునే ఆలోచన చేయరు. రాజధాని అమరావతి నిధుల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు ఇవ్వలేదు. కేవలం ప్రపంచ బ్యాంకు రుణం ఇచ్చేందుకు మాత్రమే సహకారం అందించింది. అదే సమయంలో జగన్ విషయంలోనూ ఒకింత మోదీ సాఫ్ట్ కార్నర్ లో ఉన్నారని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబును కొంత కట్టడి చేయాలంటే జగన్ ను ఇబ్బంది పెట్టకూడదన్న ఆలోచనలో ఢిల్లీ పెద్దలు ఉన్నట్లు జోరుగా ప్రచారం జరుగుతుంది. అదే జగన్ ధైర్యం అని కూడా అంటున్నారు. ఇటీవల అమిత్ షాతో విజయసాయిరెడ్డి సమావేశం కూడా అందులో భాగమేనంటున్నారు. అలాగే జగన్ కేసుల విషయంలో కూడా ఎటూ తేల్చుకుండా చూసి చంద్రబాబుకు చెక్ పెట్టడమే కమలం పెద్దల ఆలోచనగా ఉందన్న టాక్ కూడా బలంగా వినిపిస్తుంది. మొత్తం మీద కూటమి కలిసి ఉన్నప్పటికీ బలమైన నేతలను బలహీన పర్చే యత్నాలు మాత్రం ప్రారంభమయ్యాయనే అంటున్నారు. మరి ఏం జరుగుతుందన్నది చూడాలి.

## పుస్తకాల బరువు తగ్గించండి... నాణ్యత పెంచండి!



-మొదటిపేజీ తరువాయి

చేపట్టాలని అన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల విషయంలో విధివిధానాలపై సమావేశంలో చర్చించారు.

### క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ లక్ష్యంగా ఫ్రేమ్ వర్క్

యూనివర్సిటీల్లో క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ లక్ష్యంగా క్రెడిట్ ఫ్రేమ్ వర్క్, ఇంటర్న్ షిప్ లు ఉండాలని చెప్పారు. యూనివర్సిటీల వీసీల నియామకంలో అకడమిక్ ఎచీవ్ మెంట్స్, కరిక్యులమ్ డెవలప్ మెంట్, ఫైనాన్షియల్ ప్లానింగ్, ఇంటర్నేషనల్ కొలాబరేషన్ స్ట్రాటజీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. అదేవిధంగా ముఖ్యమంత్రి నేతృత్వంలో ఏర్పాటయ్యే అడ్వయిజరీ కౌన్సిల్ సభ్యుల ఎంపికలో విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలు, స్టేక్ హొల్డర్లు, పాలసీ ఎక్స్ పర్ట్స్, రీసెర్చి నిపుణులకు స్థానం కల్పించాలన్నారు. వీసీలు, అడ్వయిజరీ కౌన్సిల్ నియామకాలను మార్చి నాటికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కరిక్యులమ్ రీస్ట్రక్చర్ సమయంలో సమర్థ్ ప్లాట్ ఫాం సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. వర్సిటీల్లో హాస్టళ్ల పనితీరును మెరుగుపర్చేందుకు వెబ్ బేస్డ్ మెనూ, సజెషన్ బాక్సులను ఏర్పాటు చేయాలని అన్నారు. యూనివర్సిటీల్లో ప్రస్తుతం 36 శాతంగా ఉన్న గ్రాస్ ఎన్ రోల్ మెంట్ రేషియను 50 శాతానికి పెంచేలా చర్యలు చేపట్టాలని, చెలెనింగ్ స్కాలర్ షిప్ ల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాలల నుంచి విద్యార్థులను ఎంపికచేయాలని అన్నారు.

### మ్యాథ్స్ లో ఒకే పేపర్... బాటనీ, జువాలజీ కలిపి ఒకే పేపర్

ఇంటర్మీడియట్ లో అకడమిక్ రోడ్ మ్యాప్, రివైజ్డ్ సిలబస్ - టెక్స్ట్ బుక్స్, అకడమిక్ క్యాలండర్ రూపకల్పన న్యూ సబ్జెక్ట్ కాంబినేషన్, మార్కింగ్ ప్యాట్రన్ పై మంత్రి లోకేష్ సమీక్షించారు. ఇంటర్మీడియట్ విద్యలో గత పదేళ్లుగా ఎటువంటి సంస్కరణలు చేపట్టలేదన్నారు. మ్యాథ్స్ లో ఒకే పేపర్, బాటనీ, జువాలజీలు కలిపి ఒకే పేపర్ ఉండేలా మార్పులు చేయడంపై చర్చ సాగింది. అదేవిధంగా సీబీఎస్ఈలో మాదిరి ఇంటర్నల్ మార్కుల విధానం అమలుపై చర్చించారు. అదేవిధంగా ప్రీ ఫైనల్ ఎగ్జామ్స్ ను జనవరికల్లా పూర్తిచేసేలా క్యాలండర్ రూపొందించాలన్నారు. సంస్కరణలు తెచ్చేటప్పుడు రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటుచేసి విద్యారంగ నిపుణులు, ప్రజాప్రతినిధులు, అధ్యాపకులు, తల్లిదండ్రుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు.

## ఇరిగేషన్ శాఖ అధికారులకు గుడ్ న్యూస్

-మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాన్ని మాత్రం గత ఐదేళ్లో నిరంతరాయంగా కొనసాగించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అభివృద్ధి అనేది లేకుండా పోయింది. రహదారులు లేవు. పరిశ్రమలు లేవు, ఉపాధి లేదు. అదీకాక రాష్ట్రంలో ఉన్న పరిశ్రమలు సైతం పక్క రాష్ట్రంలోకి తరలిపోయాయి. ఇక గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఏపీకి వచ్చిన లూలూ సంస్థ సైతం రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు నిరాకరించింది. ఈ సంస్థ సైతం తెలంగాణలో పెట్టుబడులు పెట్టింది. ఇక 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ఓటరు.. కూటమికి పట్టం కట్టాడు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో రాజధాని అమరావతి పనులు ప్రారంభమైనాయి. అలాగే రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ సైతం త్వరితగతిన పూర్తి చేసుకొనుంది.

## ఒక ప్లాన్ ప్రకారం ఆరోగ్య శ్రీని నిర్వీర్యం చేస్తున్నారు

-మొదటిపేజీ తరువాయి

స్కాం చేస్తూ మీ వాళ్లకు అమ్మేస్తున్నట్టే, ఇప్పుడు ప్రజల ప్రాణాలను పణంగా పెడుతూ ఆరోగ్య శ్రీ సేవలను కూడా ప్రైవేటుకు అప్పగించడం నిజం కాదంటారా? ప్రైవేటు బీమా కంపెనీల షరతులతో పాలసీదారులు పడే అవస్తలు మనకు కనిపిస్తూనే ఉన్నాయి కదా చంద్రబాబు గారూ... మరి ఆరోగ్య శ్రీని కూడా వారికి అప్పగిస్తే వారి షరతులతో ప్రజలు ఇబ్బంది పడరా? లాభార్జనే వారి ముఖ్యోద్దేశం అయినప్పుడు ప్రజాప్రయోజనాలు ఎంతవరకు సాధ్యం? మీరు నాలుగు సార్లు సీఎం అయ్యానని గొప్పలు చెప్పుకుంటారు. కాని, పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించాలని మీరు ఎప్పుడైనా అనుకున్నారా? ఏరోజైనా కనీసం ఆ ప్రయత్నం చేశారా? పోనీ దివంగత మహానేత వైయస్సార్ గారు దేశంలో తొలిసారిగా ఆరోగ్యశ్రీ రూపంలో ఒక గొప్ప పథకాన్ని తీసుకు వస్తే దాన్ని బలోపేతం చేసేలా మీరు ఒక్కపనైనా చేశారా? వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఉచితంగా చికిత్స అందుకునే ప్రొసీజర్ల సంఖ్యను 1,000 నుంచి 3,257కి పెంచాం. మేనిఫెస్టోలో వాగ్దానం చేసినట్టుగా సంవత్సరాదాయం రూ.5 లక్షల లోపు ఉన్నవారికి కూడా వర్తింపచేసి మధ్యతరగతివారికీ మేలు చేశాం. రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యాన్ని అందిస్తూ పేదవాడికి మంచి చేశాం. ఐదేళ్ల కాలంలో 45.1 లక్షల మందికి రూ.13,421 కోట్లు ఖర్చుచేసి ఉచితంగా వైద్యాన్ని అందించాం. చికిత్స తర్వాత కోలుకునేందుకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా, చికిత్స అనంతరం విశ్రాంతి సమయంలో పేషెంటుకు తోడుగా నిలుస్తూ ఆరోగ్య ఆసరా పథకాన్ని తెచ్చి, దానికింద మరో రూ.1,465 కోట్లు అందించి రూ. 24.59 లక్షల మందికి ఆరోగ్య ఆసరాగా నిలిచాం. మరి ప్రైవేటు కంపెనీలు ఆ పని చేయగలవా? మీరు చేయించగలరా? తీరా మీరు అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ హామీలను ఎలాగూ ఎగ్గొడుతున్నారు. మేం ఇచ్చిన పథకాలనూ రద్దుచేస్తున్నారు. ఇప్పుడు కోటిన్నర కుటుంబాల ఆరోగ్యానికి ష్యూరిటీ ఎవరిస్తారు? ప్రజలకు నష్టంచేసే మీ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. వెంటనే ఆరోగ్యశ్రీని యథాతథంగా ఉంచి అమలు చేయాలి" అని జగన్ డిమాండ్ చేశారు.

## విశాఖ రైల్వే జోన్.. ఒడిస్సా అభ్యంతరం

**విశాఖపట్టణం :** ఏపీలో కొత్తగా ఏర్పాటు కానున్న రైల్వే డివిజన్‌లో వాల్తేర్ డివిజన్ భాగం కానుంది. వాల్తేర్ రైల్వే డివిజన్‌ను ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్ నుంచి వేరు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం ఒడిశాపై తీవ్ర ఆర్థిక పరిణామాలకు దారి తీస్తుందని ఒడిశాలో ప్రధాన ప్రతిపక్షమైన బీజేడీ ఆందోళన వ్యక్తం చేసింది.వాల్తేర్ డివిజన్ విశాఖ కేంద్రంగా ఏర్పాటయ్యే జోన్‌లో కలిపే అంశంపై బీజేపీ ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆ పార్టీ ప్రశ్నించింది. రాయగడలో కొత్త రైల్వే డివిజన్ ఏర్పాటును బీజేడీ స్వాగతించింది. రాయగడలో కొత్త రైల్వే డివిజన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం శంకుస్థాపన చేశారు.ఈస్ట్ కోస్ట్ రైల్వే నుంచి ఆదాయాన్ని ఆర్జించే భాగమైన వాల్తేరు డివిజన్ ను విడదీయడం కేవలం ఆంధ్రప్రదేశ్ ను ప్రసన్నం చేసుకోవడమే లక్ష్యమని బీజేడీ నేత బ్రుగు బక్షిపాత్ర ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై వారు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఈసీవోఆర్ పరిధిలో అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే డివిజన్లలో వాల్తేరు రైల్వే డివిజన్ ఒకటని పేర్కొన్నారు.డివిజన్ ను విభజించి ఈసీఓఆర్ కు కీలకమైన ఆదాయాన్ని ఆర్జించే భాగాన్ని దక్షిణ కోస్తా రైల్వే జోన్ కు బదలాయించాలన్న నిర్ణయం ఆంధ్రప్రదేశ్ ను, ముఖ్యంగా దాని రాజకీయ నాయకత్వాన్ని ప్రసన్నం చేసుకునే ప్రయత్నం మాత్రమేనని బక్షిపాత్ర విమర్శించారు.దేశంలోనే అతిపెద్ద సరుకు రవాణా ఆదాయం ఆర్జిస్తున్న కొత్తవలస-కిరండూల్ (కేకే) లైన్ సహా 1,052 కిలోమీటర్లకు పైగా రైలు మార్గాలను కవర్ చేసే వాల్తేరు డివిజన్ ఇకపై కొత్త జోన్‌లో భాగం కానుంది.వాల్తేరు డివిజన్‌లో 300 డీజిల్ లోకోమోటివ్‌లను ఉంచే సామర్థ్యంతో భారతీయ రైల్వేలో అతిపెద్ద డీజిల్ లోకో షెడ్ ఉందని, లోడింగ్ లో 75 మిలియన్ టన్నుల మార్కును దాటిన డివిజన్ గా, 2024 మార్చి 31 నాటికి రూ.10,000 కోట్ల ఆదాయాన్ని దాటిన డివిజన్ గా గుర్తింపు ఉంది.వాల్తేరు జోన్ దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని ఆర్జించే, సరుకు రవాణా విభాగాల్లో ఒకటిగా నిలిచిందని, రాష్ట్ర రైల్వే మౌలిక సదుపాయాలను మరింత బలోపేతం చేయడానికి ఒడిశా ప్రాంతాలైన జరీకెలా, బండముండా, రూర్కెలా, ఝార్సుగుడా, బెల్పహాడ్, కియోంఝర్, మయూర్భంజ్, బాలాసోర్ జిల్లాలను ఈస్ట్ కోస్ట్ రైల్వేలకు బదిలీ చేయాలని బీజేడీ డిమాండ్ చేసింది.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ఈ వింత చూడతరమా ?

## ఇక్కడ వాహన తనిఖీలు రోడ్డు పక్కనే బోల్తా కొట్టిన ట్రాక్టర్ తప్పతాగి ట్రాక్టర్ నుంచి దూకిన డ్రైవర్



**(షణ్ముఖ వెలుగు, జరుగుమల్లి, జనవరి 7)** రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసులు చేపడుతున్న డ్రంక్ అండ్ డ్రైవ్, వాహన తనిఖీలు క్షేత్ర స్థాయిలో ఏ విధంగా ఉన్నాయో చూస్తే ఆశ్చర్యం కలుగక తప్పదు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ సర్కిల్ పరిధిలో జరుగుమల్లిలో నిర్వహిస్తున్న వాహన తనిఖీలు నవ్వుల పాలవుతున్నాయి. ఒక వైపు జరుగుమల్లి పోలీస్ స్టేషన్ ఎదురుగా వాహన తనిఖీలు నిర్వహిస్తు డ్రంక్ (తరువాయి 4లో...)

# విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఇట్టా వెంకట్రావు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందజేసిన మంత్రి డాక్టర్ డోలా



4

# రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహణ

## మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

(షణ్ముఖ వెలుగు, కొనకనమిట్ల, జనవరి 7)

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని నాగంపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన రెవిన్యూ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భూ కబ్జాదారుల పాపం పండే రోజు దగ్గరకు వచ్చిందన్నారు. గత వైకాపా ప్రభుత్వంలో భూ(భక్షన) రక్షణ చట్టమంటూ జగన్మోహన్‌రెడ్డి అమలు చేసి భూ వ్యవస్థను, రెవెన్యూను శాఖను కొత్త, కొత్త చట్టాలు తీసుకొచ్చి అస్తవ్యస్తం చేశారని ఎమ్మెల్యే ఆరోపించారు. (తరువాయి 4లో...)



# కనిగిరి తహశీల్దార్, ఆర్ఐ, విఆర్ఓ సస్పెండ్

## ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా

## తహశీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి పొదిలిలో పని చేసిన కాలంలో కోట్లలో అక్రమాలు

## లోతైన విచారణ జరిగితే మరిన్ని వాస్తవాలు వెలుగులోకి



( సస్పెండ్ అయిన తహశీల్దార్ అశోక్‌కుమార్ రెడ్డి)

**(షణ్ముఖ వెలుగు బ్యూరో, ప్రకాశం, జనవరి 7)**

భూమి మ్యుటేషన్ చేయడానికి లంచం డిమాండ్ చేసిన కనిగిరి తహశీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి, విఆర్ఓ సూరసాని రాధాను సస్పెండ్ చేసినట్లు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా తెలిపారు. మ్యుటేషన్ అర్జీదారుని పట్ల దురుసుగా ప్రవర్తించిన ఆర్ఐ పురుషోత్తమ్‌రెడ్డిని కూడా సస్పెండ్ చేసినట్లు చెప్పారు. ఈ నెల 4వ తేదీన కనిగిరి మండలంలోని పునుగోడు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. మ్యుటేషన్ చేయడానికి తహశీల్దార్ లంచం డిమాండ్ చేస్తున్నారంటూ దానికి సంబంధించిన ఫోన్కాల్ రికార్డింగ్ సంభాషణను సదరు అర్జీదారుడు కలెక్టర్కు వినిపించారు. దీనిపై కలెక్టర్ విచారణ చేయించారు. అర్జీదారుని నుంచి లంచం డిమాండ్, దురుసు ప్రవర్తన నిజమేనని ఉన్నతాధికారులు సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా తహశీల్దార్ ఆర్.ఐ., వి.ఆర్.ఓ.ను కలెక్టర్ సస్పెండ్ చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**పొదిలిలో పని చేసిన కాలంలో కోట్లలో అక్రమాలు**

పొదిలి మండల తహశీల్దార్ గా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో అశోక్‌కుమార్ కోట్ల రూపాయల అక్రమాలకు పాల్పడ్డారని అప్పట్లో పెద్ద ఎత్తున చర్చ సాగింది. పొదిలిలో ఆయన పని చేసిన కాలంలో జరిగిన మ్యూటేషన్లు, ఇతరత్రా వ్యవహారాల్లో అనేక అక్రమాలకు పాల్పడ్డారనే విశ్వసనీయ సమాచారం. అయితే కనిగిరిలో ఓ కుటుంబ ఆస్తికి సంబంధించి మ్యూటేషన్ చేసేందుకు ఏకంగా రూ.2.50 లక్షలు డిమాండ్ చేసిన వ్యవహారంలో తహశీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఒక్క మ్యూటేషన్‌లోనే ఇంత నగదు లంచం అడిగాడంటే గతంలో ఆయన పని చేసిన పుల్లలచెరువు, మద్దిపాడు, పొదిలి మండలాల్లో ఏ స్థాయిలో లంచం వసూలు చేశారో వాస్తవాలు తెలియాలంటే జిల్లా ఉన్నతాధికారులు లోతైన విచారణ చేయాల్సిందే. మరి ఆ దిశగా అధికారులు చర్యలు చేపడతారో లేదో చూడాలి

# బ్యాంకులు రుణాల మంజూరు లక్ష్యాలను పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 7)**

బిసి యాక్షన్ ప్లాన్ 2024-25 పరిధిలో ఓబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం కింద బ్యాంకులకు కేటాయించిన రుణాల మంజూరు లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా బ్యాక్వర్డ్ క్లాసెస్ సర్వీస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో బిసి యాక్షన్ ప్లాన్ 2024-25 కింద ఓబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం అమలు పై ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బిసి యాక్షన్ ప్లాన్ 2024-25 కింద ఓబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకంలో భాగంగా పేద కుటుంబాలు ఆర్థికాభివృద్ధి సాధించేలా జిల్లాకు 1,195 యూనిట్లు, అలాగే ఆర్థికంగా వెనుకబడిన కులాలకు (ఈడబ్ల్యూఎస్) సంబంధించి ఓబిఎంఎంఎస్ స్వయం ఉపాధి పథకం కింద జిల్లాకు 483 యూనిట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. అలాగే నిరుద్యోగ యువకులకు రాష్ట్ర ప్రభుత్వం జనరిక్ మెడికల్ షాపులను ఏర్పాటు చేయడం జరుగుతోందని, యూనిట్ కాస్ట్ 8 లక్షల రూపాయలు ఉండగా, సబ్సిడీ 4 లక్షల రూపాయలు, బ్యాంకు రుణం 4 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందన్నారు. జిల్లాకు సంబంధించి బిసి యాక్షన్ ప్లాన్ కింద 24 జనరిక్ మెడికల్ షాప్‌లు, ఆర్థికంగా వెనుకబడిన కులాలకు సంబంధించి ఈడబ్ల్యూఎస్ యాక్షన్ ప్లాన్ కింద 85 జనరిక్ మెడికల్ షాప్ లు మంజూరు కావడం జరిగిందని, అర్హత కలిగిన బిసి, ఈబీసీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జనరిక్ మెడికల్ షాప్ ల ఏర్పాటుపై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలో 13 బ్యాంకుల పరిధిలో యూనిట్ ల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు వారీగా, బ్రాంచ్ వారీగా లక్ష్యాలను నిర్దేశించడం జరిగిందన్నారు. చిత్తశుద్ధితో పనిచేసి ఆయా బ్యాంకులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, బ్యాంకర్లను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లు కృషి చేసి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆన్లైన్లో సైట్ ఓపెన్ కావడం జరుగుతుందని, మీసేవ, సచివాలయంలో అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో బిసి కార్పొరేషన్ ఈడీ వెంకటేశ్వరరావు, ఎల్‌డిఎం రమేష్, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.



# రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహణ

వాటిని చక్కదిద్దేందుకు అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూసేందుకు కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను అన్నిచోట్ల 30 రోజులు పాటు నిర్వహించేందుకు ఆలోచన చేయడం జరిగిందన్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం పై ఎవరైనా మాట్లాడితే కేసులు పెట్టడం, భూములు స్వాధీనం చేసుకోవడం, రికార్డులు మార్చడం, వన్ బీ లు మార్చేయడం లాంటి వాటితో భయపెట్టారని, ఎంతో మంది బాధితులు ఇబ్బంది పడ్డారని ఎమ్మెల్యే అన్నారు. వాటన్నింటి లెక్క తేల్చి అసలైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూసేందుకు ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అసైన్డ్ భూములు, భూ కబ్జాలకు పాల్పడిన వారందరికీ ఖబడ్దార్ అని హెచ్చరికలు జారీ చేశారు. ఇక నుంచి అసలైన లబ్ధిదారులకు అన్ని వర్గాల వారికి న్యాయం జరిగేలా కూటమి ప్రభుత్వం శ్రద్ధ చూపుతుందన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని ముందే చెప్పాం. దాని ప్రకారం ఏ ఒక్కరికి అన్యాయం జరగకుండా చూస్తామని అన్నారు. ఇక పై కబ్జాదారులకు బ్యాండ్ బాజా తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా మీ మనస్సాక్షి కనిపిస్తే ఆక్రమణ భూములను ప్రభుత్వానికి అప్పగిస్తే కొంతైనా శిక్ష నుంచి ఉపశమనం కలిగించే అవకాశం ఉందని అటుగా ఆలోచన చేయాలని లేని పక్షంలో తగిన విధంగా చర్యలు ఉంటాయని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.





# ఈ వింత చూడతరమా ?



అండ్ డ్రైవ్ తో పాటు నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారి భరతం పడుతుండగా, వావిలేటిపాడు వైపు నుండి జరుగుమల్లి వైపుకు వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో తోలుతూ ప్రమాదానికి గురి చేయడంతో ట్రాక్టర్ ట్రాలీతో సహా బోల్తా కొట్టింది. ఇక్కడ విచిత్రం ఏమిటంటే మద్యం మత్తులో ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ తన ప్రాణాలు కాపాడుకోవడం కోసం ట్రాక్టర్ నుంచి దూకి ప్రాణాపాయం నుండి బయట పడ్డాడు. ఇక్కడ ఆసక్తి కరమైన విషయం ట్రాక్టర్ డ్రైవర్‌కి వాహనం నడిపేందుకు ఎటువంటి పత్రాలు లేవని తెలుస్తోంది. తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. వాహన తనిఖీలు ఏ విధంగా జరుగుతున్నాయో ఈ సంఘటనను చూస్తే అర్థం చేసుకోవచ్చు. ఇకనైనా రోడ్డు ప్రమాదల నివారణ దృష్ట్యా పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపే ఇలాంటి వారి పై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిని పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.



# విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఇట్టా వెంకట్రావు కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం అందజేసిన మంత్రి డాక్టర్ డోలా

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 7)

విద్యుత్ ప్రమాదంలో మృతి చెందిన ఇట్టా వెంకట్రావు కుటుంబానికి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంగళవారం తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో రూ.5లక్షల పరిహారం చెక్కును అందజేశారు. కొండపి నియోజకవర్గం చిర్రికూరపాడుకు చెందిన ఇట్టా వెంకట్రావు గతేడాది అక్టోబర్ 1న విద్యుత్ షాక్ కి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి డోలా బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం స్పందించి రూ.5 లక్షల పరిహారం మంజూరు జేసింది. ఈ చెక్కును మంత్రి డోలా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు గొట్టిపాటి, డోలాకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# డూండి రాకేష్‌ను సన్మానించిన పందిటి హరీష్



(షణ్ముఖ వెలుగు, పామూరు, జనవరి 7)

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డూండి రాకేష్‌ను టిడిపి యువ నాయకులు, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు పందిటి హరీష్ ఘనంగా సన్మానించారు. విజయవాడలోని వన్ టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలిపారు. రానున్న రోజుల్లో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# సిఎఫ్ఎల్‌డి వేరుశనగ రైతులకు సమగ్ర పోషకాల, సమగ్ర సస్యరక్షణ యాజమాన్యం పై శిక్షణ

## జిప్సం ఎరువు పంపిణీ

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 7)

కృషి విజ్ఞాన కేంద్రం, కందుకూరు సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ జి ప్రసాద్ బాబు ఆద్వర్యంలో ఉలవపాడు మండలంలో అలగాయపాలెం, బట్టిసోమపాలెం టెంకాయచెట్ల పాలెం గ్రామ వేరుశనగ రైతులకు జాతీయ ఆహార బద్రత మిషన్ క్రింద సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాల నిర్వహణలో భాగంగా సమగ్ర పోషకాల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ పై శిక్షణా కార్యక్రమాన్ని, రోగనిర్ధారణ సందర్శనలను చేపట్టడం జరిగింది. సీనియర్ శాస్త్రవేత్త మాట్లాడుతూ వేరుశనగ ప్రస్తుతం పూత మైర్యా వూడలు దిగే దశలో వుందని ఈ దశలో అందరూ రైతులు ఎకరాకు 200 కిలోల జిప్సం ఎరువును చల్లుకొని భూమిలో కలుపుకోవడం ద్వారా వూడలకు కావలసిన కాల్షియం, నూనె పెరగడానికి కావలసిన సల్ఫర్ అందుబాటులోకి వచ్చి అధిక కాయ దిగుబడి తీసుకోవచ్చని తెలిపారు. అలాగే రైతులతో కలసి పొలాలను సందర్శించడం జరిగింది. ఇందులో ప్రస్తుతం కాండం కుళ్ళు తెగులు, మచ్చ తెగులు గమనిచడం జరిగింది. కాండం కుళ్ళు తెగులు నివారణకు ట్రైకోడెర్మ విరిడే మరియు సూడోమోనాస్ జీవ శిలీంధ్ర నాసినులను ఎకరాకు 2 కిలోల చొప్పున 100 కిలోల పేడ ఎరువులో కలుపుకొని 15 రోజులు మగ్గబెట్టి పొలంలో సమానంగా ఆఖరు దుక్కిలో వేసుకోవాలని తెలిపారు. అలాగే మచ్చ తెగుళ్ళ నివారణకు ఎకారాకు హెక్సాకొనజోల్ 400 మీ.లీ. లేదా టేబుకొనజోల్ మందును ఎకారాకు 200 మీ.లీ. 200 లీటర్ల నీటిలో





కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. అలాగే బంతి పంటలో వేరుకుళ్ళు తెగులు గమనిచడం జరిగిందని దీని నివారణకు లీటరు నీటికి కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు కలుపుకొని మొక్క మొదళ్ళలో పోసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమలో శాస్త్రవేత్తలు డా.వెంకటేష్, డా.జ్యోతి, మాయాంక్, డా. శ్రీరంగ ఉలవపాడు మండల వ్యవసాయ అధికారిని తిరుమల జ్యోతి, రైతు సేవా కేంద్రం వీఏఏ వంశీ, రైతులు, రైతు మహిళలు, ఏపీ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# కందిలో కాయ తొలుచు పురుగులు అరికడితే అధిక దిగుబడి

## పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేష్





(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జనవరి 7)

మండలంలోని కాకర్ల, శివరాయునిపేట గ్రామాలలో మంగళవారం వ్యవసాయ అధికారి వెంకటేష్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి వెంకటేష్ మాట్లాడుతూ రైతులు ప్రస్తుతం కందిలో కాయ తొలుచు పురుగులను అరికడితే అధిక దిగుబడులను పొందవచ్చని తెలిపారు. అనంతరం క్షేత్ర పర్యటనలో శనగ పచ్చ పురుగు గమనించడం జరిగిందని, దీని నివారణకు పూత దశలో క్లోరి ఫైరిఫాస్ 2.5 ఎంఎల్ లేదా డైమితోయేట్ 2 ఎంఎల్, అదే కాయ దశలో ఉన్న పంటలో నావెల్యురాన్ 1 ఎంఎల్ లేదా ఇమాంక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాములను లీటర్ నీటికి కలుపుకుని పిచికారి చేసుకోవాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు బ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్, ఎంపీటీసీ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జనవరి 7)

మండలంలోని కే అగ్రహారం గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని సర్పంచ్ షేక్ చిన్న మస్తాన్, ఎంపీటీసీ రామాంజనేయులు తనిఖీ చేసి పరిశీలించారు. పిల్లలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. మీకు సకాలంలో అందకపోతే మా దృష్టికి తెచ్చినట్లయితే సంబంధించిన అధికారులతో మాట్లాడి మీ సమస్యలను పరీక్షిస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, సూపర్వైజర్ రమాదేవి గర్భిణులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ డేటాలో మార్పు చేయాలి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం టౌన్, జనవరి 7)

ఎస్సీ వర్గీకరణ ఏబిసిడిలుగా వర్గీకరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేయాలని, ఎస్సీ కుల గణన, సోషల్ ఆడిట్ ఆంధ్రప్రదేశ్లో అన్ని సచివాలయంలో కుల గణన డేటాను ఉంచడం జరిగింది. అయితే ఆ డేటాలో గత ప్రభుత్వం తప్పుడు తడకలుగా నమోదు చేసింది. అందులో మాదిగల జనాభాను తగ్గించేలా, డేటాలో మాదిగ క్రిస్టియన్‌గా నమోదు చేయడం జరిగింది. మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు, విజయవాడ అర్బన్‌లో అన్ని సచివాలయలకు వెళ్లి డేటాను పరిశీలిస్తే, పేరు ఉంటే, కులం ఉండదు, కులం ఉంటే, మతం ఉండదు. అన్ని తప్పుడుగా నమోదయ్ ఉన్నందున, అందరికీ మాదిగ హిందువుగా నమోదు చేయాలని, వెంటనే అధికారులు, రెవెన్యూ సిబ్బంది వెంటనే వీటన్ని పరిశీలించి మార్పు చేయాలని, ఎమ్మార్పీఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇది మార్పు చేయకపోతే యావత్తు రాష్ట్రంలో ఉన్న ఎస్సీ మాదిగల జీవితాలు అంధకారంలోకి నెట్టబడి వేయబడతాయి.

కాబట్టి వెంటనే మార్పు చేయాలని కోరారు. ప్రతి ఒక్క మాదిగ పల్లెలో ఉన్న యువత మీకు సంబంధించిన సచివాలయంలో డేటాని పరిశీలించి తప్పులు ఉంటే వెంటనే సరిదిద్దుకునేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు.

# నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత



(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 7)

ఉలవపాడు సమీప గ్రామాల్లో బుధవారం 11 కెవి ఎక్స్ ప్రెస్ ఫీడర్‌కు ఉదయం 8 నుండి రాత్రి 8 గంటల వరకు ఇండోసల్ కంపెనీ వారికి లైన్ లాగుటకు ఎల్‌సి ఇవ్వబడును. కావున కె రాజుపాలెం గ్రామం, సంఘం, హైవే మీద ఉన్న డాబాలకు కరెంటు సరఫరా నిలిపివేయబడుతుందన్నారు. ప్రజలందరూ సదరు విషయం గమనించి కరెంటు డిపార్ట్మెంట్ వారికి సహకరించాలని, ఉలవపాడు మండల విద్యుత్ ఈఈ పి శ్రీనివాసరావు తెలిపారు.

# నెల్లూరు రూరల్‌లో జాతరలా అభివృద్ధి పనులు

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో

కోట్ల రూపాయల నిధులతో వాడవాడలా అభివృద్ధి పనులు





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 7)

సోమవారం ఉదయం నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అయ్యప్పగుడి నుంచి కేవిఆర్ పెట్రోల్ బంక్ వరకు 2కోట్ల 52 లక్షల రూపాయల నిధులతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఆర్థిక విధానాలతో రాష్ట్రం పూర్తిగా దివాళా తీసిందన్నారు. గత ప్రభుత్వంలో వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ నాయకులు అభివృద్ధి, అభివృద్ధి అని టెంకాయలు కొట్టారు తప్ప, పనులు ప్రారంభం కాలేదని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి అన్నారు. తాను టెంకాయలు కొట్టాను అంటే పనులు పూర్తి కావలసిందే. మనం చేసేదే ప్రజలకు చెప్పాలని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తెలిపారు. నెల్లూరు రూరల్ లో అభివృద్ధి పనులు ఒక జాతరలా సాగుతున్నాయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో కోట్ల రూపాయల నిధులతో వాడవాడలా అభివృద్ధి పనులు సాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, కార్పొరేటర్ భీమినేని మురహరి, టీడీపీ నాయకులు చెక్క సాయి సునీల్, బూడిద పురుషోత్తం యాదవ్, బాలకృష్ణ, శివ, పుష్పరాజ్, కుమార్, ఈశ్వరయ్య, వెంకటేశ్వర్లు నాయుడు, సురేష్ రెడ్డి, రాజశేఖర్, రఘురాం, శీను, జనసేన పార్టీ నాయకులు చిత్తలూరు సుందర రామిరెడ్డి, ఉదయ్, బీజేపీ నాయకులు పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్టియన్ ముసుగులో మోసపోతున్న మాదిగలు.

## కులగణన పేరుతో ఇక్కడి అధికారులు, సచివాలయాల సిబ్బంది, హిందూ మాదిగలను ,హిందూ క్రిష్టియన్‌గా ఎక్కించడం అన్యాయం

దళిత సంఘ నేత రాచేటిప్రసాద్ ధ్వజం





(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జనవరి 7)

యర్రగొండపాలెం పట్టణ తహాశీల్దారు కార్యాలయ ఆవరణలో జరిగిన నిరసన కార్యాక్రమంలో దళిత సంఘ నాయకులు పాల్గొని మాదిగలకు న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. అనంతరం కార్యాలయం ఎదురు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఖ్యపరంగా మాదిగలు ఎక్కువగా ఉన్న యర్రగొండపాలెం పట్టణంలో పేర్లను మార్చి క్రిష్టియన్‌గా ఎక్కిస్తున్నారని సచివాలయం రెండు పరిధిలో 700 మందికి పైగా హిందూ మాదిగలుగా ఉంటే దాదాపుగా 500 మందికి పైగా హిందూక్రిష్టియన్ గా జాబిత తయారు చెయడం తగదని అన్నారు. సచివాలయాల ముందు జాబితా ప్రకటించాల్సి ఉన్నా సిబ్బంది జాబితాను బయట పెట్టక పోవాడం ఎంటని ప్రశ్నించారు దీనిపై తహాశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాదిగలతో పాటు నాయకులు సుబ్బయ్య, వెంకటయ్య, జయన్న, ఏసోబు, క్రుపాదానం, నాసరయ్య పాల్గొన్నారు.

# 18 నుంచి మూడు రోజుల పాటు ఫ్లెమింగో ఫెస్టివల్

ప్రణాళిక సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు








(షణ్ముఖ వెలుగు, సూళ్లూరుపేట ఇంచార్జ్, జనవరి 7)

తిరుపతి జిల్లా సూళ్లూరుపేట పండగకు సంబంధించి సూళ్లూరుపేట ఎస్‌కేఎస్ కళ్యాణమండపం నందు జిల్లా అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్ఓ అధ్యక్షతన జరిగింది. డిఆర్ఓ మాట్లాడుతూ అందరి అధికారులకు సూళ్లూరుపేట పక్షుల పండగను నిర్వహించేందుకు ఒక్కొక్క శాఖను ఒక్కొక్క అధికారికి కేటాయిస్తూ ప్రకటించడం జరిగింది. పక్షుల పండగ చైర్మన్ గా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ఉండగా మిగిలిన అన్ని శాఖలకు సంబంధించి బి వి పాలెం పాలెం లో పడవల షికారు. అట్టికానీతిప్ప పులికాట్ సరస్సు పక్షుల వీక్షణ, ఫిల్మ్ షో నేలపట్టు పక్షుల రక్షిత స్థలం ఫ్లెమింగో పక్షుల వీక్షణ మరియు సులూరుపేట ఫ్లెమింగో ఫెస్టివల్ మైదానంలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, ఈ నాలుగంటినే కాకుండా ఈ సమాచారం క్రొత్తగా శ్రీ సిటీ నందు కూడా వారు చేసే ప్రక్రియల పై సందర్శన చేసేందుకు ఏర్పాట్లు వీటిని ప్రధాన కేంద్రాలుగా తీసుకొని ఒక్కొక్కరికి ఒక్కొక్క బాధ్యతను అప్పగించడం జరిగింది. అంతే కాకుండా సమావేశంలో అందరి సలహాలను సంప్రదింపులను చేయడం జరిగింది. గతంలో జరిగినటువంటి పక్షుల పండక్కు వారి అనుభవాలను తీసుకోవడం జరిగింది. వాటిలో భాగంగా గతంలో జరిగినటువంటి అవకత ఒకలను సమర్పించుకుంటూ జరగబోయేటువంటి పక్షులు పండుగను ఇంకా ఘనంగా నిర్వహించాలని ఆలోచించారు. రెండు రోజుల్లో పక్షుల పండగ సంబంధించినటువంటి గోడ పోస్టర్లను రిలీజ్ చేస్తున్నట్టు కలెక్టర్ తెలియజేశారు. కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నవంబర్ లో ఫ్లెమింగో ఫెస్టివల్లకు ఆమోదం తెలపం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ మాట్లాడుతూ ఫ్లెమింగో ఫెస్టివల్ సమయంలో అనేక మంది మంత్రులు సూళ్లూరుపేట కు రావడం జరుగుతుంది అని వారి ద్వారా సూళ్లూరుపేటలో అబివృద్ధి పనులు మంజూరు చేసుకోవడం జరుగుతుందన్నారు. కోరిడి, పెర్నాడు, వేనాడు గ్రామాలకు కచ్చితంగా రోడ్డు నిర్మాణం ఈ నాలుగు సంవత్సరాల కాలంలో పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సమాచారం ఫ్లెమింగో ఫెస్టివల్‌కు సుమారు ఏడు లక్షలమంది హాజరు కానున్నారని ఫ్లెమింగో ఫెస్టివల్ జరుపుకునేందుకు అందరు సహకరించాలని కోరారు. కార్యక్రమానికి సూళ్లూరుపేట తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రమణ్యం మాజీ ఏంఎల్‌సి వాకాటి నారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి, సూళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, మాధవ నాయుడు, తిరుపతి జిల్లా అధికార యంత్రాంగం హాజరు కావడం జరిగింది.

# మా బిడ్డలను కాపాడండి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్‌కు అభ్యర్థన




(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 7)

మలేషియాలో బతుకు దెరువుకు వెళ్లి ఆచూకీ లేకుండా పోయిన తమ బిడ్డను కాపాడాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లే విధంగా జనసేన క్రియాశీలక సభ్యుడు సింహాద్రి , పవన్‌ని కాపాడవలసిందిగా జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో కిషోర్‌ను సంప్రదించారు నెల్లూరు రూరల్, వనంతోపు సెంటర్ నందు నివసిస్తున్న వారి తల్లిదండ్రులు జయమ్మ,పెద్దయ్యలు. ఆరు నెలల ముందు తిరుపతిలో దళారిని , చెన్నైలో ఏజెన్సీ నమ్మి వర్క్ పర్మిట్ లేకుండా తన బిడ్డకి పని ఇప్పిస్తానని తీసుకెళ్లి మోసం చేశారని, వారం రోజుల నుంచి ఫోన్ కి అందుబాటులో లేకపోవడంతో తల్లడిల్లుతూ వారి తల్లిదండ్రులు జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో తమ బిడ్డలను కాపాడాలంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి అభ్యర్థన అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ టిడ్ కో చైర్మన్ వేములపాటి అజయ్ సూచనలతో తల్లిదండ్రుల వేదనను పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు వస్తామన్నారు. కాసుల కోసం కక్కుర్తి పడి దళారీలు వర్క్ పరిమితులు లేకుండా దేశాలు దాటించి యువతను పంపించడం నేరమన్నారు. ఈ విషయాన్ని స్థానిక పోలీస్ స్టేషన్ కి,ఎస్పీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏపీ టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ చొరవ తో పొట్ట చేత్తో పట్టుకొని దేశాలు దాటిపోయిన యువతను కాపాడే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. మలేషియా కాన్సిలేట్‌ని సంప్రదించి విడిపించేందుకు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఏజెన్సీ వ్యవస్థలు ఎవరైతే ఉన్నారో నియమాలు పాటించకుండా వర్క్ పర్మిషన్ లేకుండా తెలిసి తెలియని యువతల జీవితాలతో ఆడుకుంటున్నారని వారి పై కేసులు పెట్టి శిక్షలు పడేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, సీనియర్ నాయకులు నూనె మల్లికార్జున యాదవ్ పాల్గొన్నారు.



# మిరపలో తామర పురుగు, ఎర్రనల్లి ఉధృతంగా ఉంది

మండల వ్యవసాయ అధికారి ఎస్కె జైనుల్ లాబ్దిన్





(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 7)

మిరపలో తామర పురుగు, ఎర్రనల్లి ఉధృతంగా ఉందని వాటి నివారణకు సత్రం చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్కె జైనుల్ లాబ్దిన్ సూచించారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మిరప తోటను పరిశీలించి తామర పురుగు నివారణకు రైతులు అధిక మోతాదులో నత్రజని వినియోగించడాన్ని తగ్గించాలన్నారు. మల్బింగ్ , బులుగు రంగు అట్టలను తప్పకుండా వినియోగించాలన్నారు. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు బవేరియా భాసియానా మరియు లికాని సిలియమ్ లికా అనే జీవ శీలింద్ర నాశనీలను ఐదు గ్రాములు లీటర్ నేటికీ కలిపి పిచికారి చేయాలన్నారు. రైతులు బాసరవెక్కువగా ఉండే ఎరువులను పూర్తిగా నిలిపివేయాలని బలం మందులైన మ్యాక్స్-4 గ్రాములు,19:19:19,13:0:45 పై పాటు గా అందించాలన్నారు. అదేవిధంగా ఎర్ర నల్లి నివారణకు ఓమైట్ లేదా అబాసిన్ రెండు గ్రాములు, లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు.

# తన తొలి ప్రాధాన్యం గిరిజనుల అభ్యున్నతిపైనే

కనీసం ఆధార్ కార్డులు ఇప్పించకుండా సచివాలయ ఉద్యోగులు ఏం చేస్తున్నట్లు

జిల్లా స్థాయిలోనూ గిరిజనుల సమస్యల పరిష్కారం పై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి









(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 7)

గిరిజన బిడ్డలు కనీసం ఆధార్ కార్డులకు కూడా నోచుకోకపోవడం బాధాకరమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. కనీస అవసరమైన ఆధార్ కార్డులు లేక గిరిజనులు రేషన్ కార్డులతో పాటు ఇతర సంక్షేమ పథకాలు పొందలేకపోతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినాక నేను గిరిజనుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టానన్నారు. ఒక్క పైనాపురం పంచాయతీలో 70 మందికి జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయించడంతో పాటు 80 మందికి ఆధార్ కార్డులు నమోదు చేయించాం, 17 మందికి పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చామన్నారు. 43 మందికి అర్హత ఉన్నా ఓటు హక్కు లేదు, 35 మందికి రేషన్ కార్డులు లేవు..18 మంది పింఛన్ పొందలేకపోతున్నారు. సమాజంలో ప్రత్యేకంగా గిరిజనులే అన్యాయానికి గురవుతుండటం దురదృష్టకరమన్నారు. 12 మంది ఉద్యోగులతో గ్రామంలోనే సచివాలయం ఉండటంతో పాటు మండల స్థాయిలో అధికారులు ఉన్నా పేదల కనీస అవసరాలు తీర్చలేకపోడం సరికాదన్నారు. గిరిజనుల అవసరాలు తీర్చలేని సచివాలయాలు ఎందుకు? జిల్లా స్థాయిలో గిరిజనులకు ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయడంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మేం ఇటీవలే సర్వేపల్లి నియోజకవర్గ స్థాయిలో గిరిజనుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించామన్నారు. ఆ గ్రీవెన్స్ కార్యక్రమంలోనే వందలాది మందికి ఆధార్ కార్డులు నమోదు చేయించామన్నారు. ఆధార్ కార్డు లేక పోతే భారత పౌరుడనే ఆధారం కూడా లేని పరిస్థితి. త్వరలోనే అందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు పక్కా ఇళ్లు కట్టిస్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందజేయడంతో పాటు గిరిజన కాలనీల్లో ప్రత్యేక వసతులు కల్పిస్తామన్నారు. గిరిజన బిడ్డలు తప్పనిసరిగా బడికి వెళ్లడంపైనా అందరూ శ్రద్ధవహించాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి సూచించారు.

# శీఘ్ర దర్శనం టోకెన్లతో సులభంగా శ్రీగిరి శ్రీవారి దర్శనం



## ముక్కోటికి శ్రీగిరిలో విస్తృత ఏర్పాట్లు
## బుధవారం నుంచి శీఘ్ర దర్శనం టోకెన్లు జారీ
## శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 7)

ఈ నెల 10వ తేదీ శుక్రవారం ముక్కోటి పర్వదినం రోజున భక్తులు త్వరితగతిన తమ కుటుంబ సభ్యులతో శ్రీ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు వీలుగా గంటకు వంద శీఘ్ర దర్శనం టోకెన్లను జారీ చేయనున్నట్లు కుర్తాళం శ్రీ సిద్దేశ్వరీ పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, కార్య నిర్వహణ ధర్మకర్త సివి రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి వెల్లడించారు. మంగళవారం శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వివరాలను వెల్లడించారు. ముక్కోటి పర్వదినం శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దర్శనానికి విచ్చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. శీఘ్ర దర్శనం టోకెన్లతో సమయం వృధా కాకుండా భక్తులు తమ కుటుంబ సభ్యులతో శ్రీవారిని దర్శించుకునేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు. బుధవారం నుండి శీఘ్ర దర్శనం టోకెన్ల జారీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. శీఘ్ర దర్శనం టోకెన్లు కావలసిన భక్తులు శ్రీగిరి దేవస్థానం కార్యాలయంలో సంప్రదించాలని తమ ఆధార్ కార్డును వెంట తీసుకురావాలని ఒక ఆధార్ కార్డు పై సంబంధిత కుటుంబ సభ్యులందరినీ వారు కోరుకున్న సమయంలో శీఘ్ర దర్శనానికి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముక్కోటి పర్వదినం నాడు భక్తుల రద్దీని క్రమబద్ధీకరించడంతోపాటు భక్తులకు శ్రీవారి దర్శనం శీఘ్ర గతిన జరిగేలా శీఘ్ర దర్శనం టోకెన్లు జారీ పద్ధతి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. శ్రీగిరి లో నూతనంగా ప్రవేశపెట్టిన శీఘ్ర దర్శనం కార్యక్రమం విజయవంతమయ్యేలా భక్తులు శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులకు తమ వంతు సహకారం అంద చేయాలని కోరారు.

**13 నుండి ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాలు:**

శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 13 నుండి 15 వరకు ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడించారు. 13వ తేదీ సాయంత్రం 7 గంటలకు ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు అచ్చ తెలుగు అవధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ధనుర్మాస వైభవం అనే అంశం పై ఉపన్యసిస్తారు. 14వ తేదీ సాయంత్రం 6 గంటలకు శ్రీవారి ఊంజల సేవ.. శ్రీగిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వివిఎస్ వినోద్ కుమార్‌చే భక్తి సంగీత విభావరి,.15వ తేదీ సాయంత్రం శ్రీవారి తిరు వీధి ఉత్సవం.. స్వర్ణ సుబ్బారావు బృందంచే కోలాట ప్రదర్శన జరుగుతాయి.

**25న విగ్రహ ప్రతిష్టాపన:**

శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాత, వ్యవస్థాపక ధర్మకర్త దివంగత ఆలూరు వెంకట రమణా రావు కాంస్య విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని ఈ నెల 25 వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు శ్రీ గిరిలో నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడించారు. మధ్యాహ్నం 12 గంటలకు శ్రీగిరి గో క్షేత్రంలో జరిగే అభినందన సభలో విశ్రాంత హై కోర్టు జడ్జి డాక్టర్ కె జి శంకర్, విశ్రాంత పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ జి సూర్య ప్రకాశరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, హై కోర్టు అడ్వకేట్ వి ఉమాదేవి తదితరులు పాల్గొంటారు. సాయంత్రం 6 గంటలకు శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో దివంగత ఆలూరు సీతారామమ్మ పేరిట వకుళారాధన కార్యక్రమం జరుగుతుంది. వకుళారాధనలో భాగంగా ప్రముఖ సంగీత విద్వాంసులు..వెంకటగిరి మాజీ శాసన సభ్యులు డాక్టర్ వి బి సాయికృష్ణ యాచేంద్ర చే సంగీత గేయ ధార కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆలూరు ఝాన్సీ రాణి తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాలలో పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని శ్రీగిరి ఆలయ నిర్వాహకులు కోరారు.

# బాగా చదవండి పరీక్షలకు సిద్ధం కండి

## పదో తరగతి ప్రజ్ఞా వికాస పరీక్ష విజేతలకు అభినందన సభలో ఒంగోలు ఎంఈవో కిషోర్ బాబు పిలుపు






(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 7)

డిసెంబర్ 24న ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ ప్రకాశం జిల్లా కమిటీలు నిర్వహించిన 10వ తరగతి ప్రజ్ఞ వికాస పరీక్ష విజేతలకు ఒంగోలులోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయం నందు అభినందన సభ నిర్వహించారు. ఈ సభకు ఒంగోలు ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వీరాస్వామి అధ్యక్షత వహించగా ఒంగోలు ఎస్ఎఫ్ఐ కిషోర్ బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వి బాలకోటయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎంఈవో కిషోర్ బాబు మాట్లాడుతూ విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను అభినందించారు. విద్యార్థులు చదువులతో పాటు సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా ముందు ఉండాలని కోరారు. చదువులు పరీక్షల కోసం మాత్రమే కాదు జ్ఞానం పెంచుకునేందుకు ఉపయోగపడాలని తెలిపారు. జరగబోవు 10 పరీక్షల్లో బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ విద్యార్థులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లను ఆదర్శంగా తీసుకొని సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని అన్నారు. కుల, మత ప్రాంతాల విచ్ఛిన్నకర ఉద్యమాల వైపుకు పోకుండా అందరిపట్ల స్నేహభావం కలిగి ఉండాలని కోరారు. మద్యం, డ్రగ్స్, గంజాయి వంటి అలవాట్లు యువతలో పెరుగుతున్నాయి వాటికి వ్యతిరేకంగా మనం పెద్ద యెత్తున పోరాడాలి అన్నారు. రాబోవు రోజుల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలు ఇంకా నిర్వహించి విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వి.బాలకోటయ్య మాట్లాడుతూ బాగా చదివి మీ తల్లిదండ్రులకు, మీ పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సమాజ అభివృద్ధికి మీ సహకారం ఉండాలని కోరారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు వుండాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వినోద్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఒకవైపు పోరాటాలు నిర్వహిస్తూనే మరోవైపు విద్యార్థులను చదువుల్లో ప్రోత్సహించేందుకు ఇటువంటి ప్రోత్సాహక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బ్లడ్ డొనేషన్ క్యాంపులు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల్లో సేవా ,స్నేహ భావాలు పెంపొందించే ప్రయత్నం చేస్తున్నామన్నారు.

# ప్రతి ఒక్క రైతుకి ఈ పంట కచ్చితంగా నమోదు చేయాలి

## మండల వ్యవసాయ అధికారిణి కె బుజ్జి బాయి



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, జనవరి 7)

మండలంలో మండల వ్యవసాయ అధికారిణి కె బుజ్జి బాయి ఆధ్వర్యంలో పెద్దారవీడు రైతు సేవా కేంద్రం, రైతు పొలాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంది పంటను సందర్శించారు. కంది ప్రస్తుతం పూత, కాయ దశలో ఉంది. కందిలో గింజ పరిమాణం పెరగడానికి 13-0-45ను వేసుకోవాలని సూచించారు. అలాగే ప్రస్తుత దశలో మారుకా మచ్చల పురుగు ఉధృత ఎక్కువ ఉందని గుర్తించారు. ఈ పురుగు నివారణకు తొలి దశలో క్లోరి పైరఫాస్ 2.5 ఎంఎల్ తర్వాత దశలో నోవల్యూరాన్ ఒక మిల్లీలీటర్ ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు స్పైనోసాడ్ 0.3 ఎం.ఎల్, లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి అని సూచించారు. అదే విధంగా అక్కడున్న గ్రామ వ్యవసాయ సహాయకులుకులకి ప్రతి ఒక రైతుకి ఈ పంట కచ్చితంగా నమోదు చేయాలని చెప్పారు. ఈ పంట నమోదు చేసుకోవడానికి రైతులు కచ్చితంగా తమ పంట పాస్ బుక్కు, ఆధార్ కార్డు, బ్యాంక్ డాక్యుమెంట్స్, కౌలు రైతులు అయితే కవులు కార్డు, తీసుకొని రావాలని సూచించారు. అదేవిధంగా ప్రతి ఒక్క రైతు ఈ పంటను నమోదు చేసుకోవాలని గ్రామంలో దండోరి వేపించి చెప్పారు. ఈ పంట అనేది ప్రతి ఒక్క రైతు పొలంలోకి వెళ్లి రైతు ఫోటో దిగి ఆన్లైన్లో చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే ఏ పథకాలకైనా ఈ పంట లో నమోదయి ఉండాలని చెప్పారు. అదేవిధంగా జాతీయ డిజిటల్ అగ్రికల్చర్ మిషన్- అగ్రి స్టాక్ ప్రాజెక్ట్ పేరిట ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రారంభం ఇచ్చారు. ఇది రిజిస్ట్రేషన్ వలన యూనిక్ కోడితో రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయి సబ్సిడీలు, రుణాలు, పంటల బీమా వంటి పథకాలను ఈ కోర్టుతో అనుసంధానం చేస్తారు. ఫామర్ రిజిస్ట్రేషన్ యూనిఫైడ్ ల్యాండ్ ఏపీఐ, ఆధార్ బేసిడ్ అతంటికేషన్, పిఎం కిసాన్ వంటి డిజిటల్ అగ్రికల్చర్ అనుసంధానం చేస్తారు. కౌలు రైతులతో పాటు భూమిలేని కూలీలకు సైతం ఆధార్ నంబర్లు ఆధారంగా రిజిస్టర్లో పేర్లు నమోదు చేసుకోవచ్చు. ఈ ఐడీలను ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు లింక్‌తో కూడిన ఆర్థిక సేవలు పొందవచ్చు. పంటలనుకు కనీస మద్దతు ధర పొందేందుకు కూడా ఈ ఐడి ఉపయోగిస్తారు. ఈ ఐడి సహాయంతో దేశంలో ఎక్కడ ఉంచేనైనా రైతులు రుణాలు అర్హత, రుణ బకాయిలు, ప్రభుత్వ పథకాలు జమ వంటి వివరాలను క్షణాల్లో తెలుసుకోవచ్చు. ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ దగ్గరలో ఉన్న రైతు సేవ కేంద్రాల ద్వారా చేస్తారు. రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ ప్రారంభమవుతుంది. ఈ రిజిస్ట్రేషన్ కోసం రైతు సేవ కేంద్ర సిబ్బంది రిప్లై డేటా ఆధారంగా రైతుల వివరాలను ఫార్మర్ రిజిస్టర్‌లో నమోదు చేసి యుసిలు కేటాయిస్తారు. వాటిని తహసీల్దార్‌లు అప్రూవల్ చేస్తారు. రైతులు లేవనేత్తే అభ్యంతరాలను మండల వ్యవసాయ శాఖ అధికారులు పరిష్కరిస్తారు. జిల్లా, మండలాలు, గ్రామాల వారీగా రైతులు రిజిస్ట్రేషన్ ని చేసుకోవచ్చు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి కె.బుజ్జి బాయి, రైతులు పాల్గొన్నారు.

# సాగుచేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలి

## వ్యవసాయ విస్తరణ అధికారి యల్ మాల్యాద్రి


(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, జనవరి 7)

మండలంలోని వీరబద్రపురం, బోయలపల్లి గ్రామాలలోని గ్రామ రైతు సేవ కేంద్రం నందు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా ఆయా గ్రామాల్లో ఉన్న రైతు సోదరులతో కలిసి సాగు చేస్తున్న కంది, మిరప పంటలను క్షేత్రస్థాయిలో సందర్శించి,అనంతరం రైతు సేవ కేంద్రం వద్ద గ్రామసభ నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి యల్.మాల్యాద్రి మాట్లాడుతూ రబీ కాలంలో సాగుచేసిన ప్రతి పంటను పంట నమోదు చేసుకోవాలి అని, ఖరీఫ్‌లో కంది పంట సాగు చేసిన ప్రతి ఒక్కరు రైతు సేవ కేంద్రం సిబ్బంది దగ్గరకు వెళ్లి ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అని తెలిపారు. అలాగే ఉద్యానశాఖ అధికారి .పి ఆదిరెడ్డి మాట్లాడుతూ మిరపలో చేపట్టవలసిన యాజమాన్య పద్దతులు గురించి తెలియజేసారు .అదే విదంగా ప్రకృతి వ్యవసాయ పద్దతిలో సాగు చేస్తున్న మిరప పంటలను పరిశీలించి, రైతులు ఉపయోగిస్తున కాషాయాలు గురించి అడిగి తెలుసుకొని ,అధికారుల అద్వర్యంలో ఎప్పుడు సిఎన్ఎఫ్ సిబ్బంది వేపాకుల కాషాయం తయారీ విధానం, ఉపయోగాలను రైతులకు వివరించటం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది రమేష్, అంజి నాయక్, ఎపిసిఎన్ఎఫ్ సిబ్బంది మద్దయ్య, మస్తాన్, శివ, నాసరయ్య, నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.




# బాల్యవివాహాలు, నైతిక విలువల పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, కంభం, జనవరి 7)

జిల్లా ఎస్పి ఏ ఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కంభం బాలికల ఉన్నత పాఠశాలలో కంభం ఎస్ఐ బి నరసింహారావు విద్యార్థినులకు బాల్యవివాహాలు, నైతిక విలువలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థినులు అందరూ బాగా చదువుకొని మంచి పేరు తెచ్చుకోవాలని, మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని బాగా చదువుకొని మీ తల్లితండ్రులకు మంచిపేరు తీసుకొని రావాలని చదువుకి పేదరికం అడ్డుకాకూడదు అని, ఆకాతాయిల పట్ల అప్రమత్తంగా ఉండాలని బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, మీకు ఎవరైనా ఆకతాయిలు ఇబ్బంది కలిగిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, మహిళలకు అనేక చట్టాలు ఉన్నాయని, మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కోటంరెడ్డిని కలిసిన మదీనా వాచ్ అధినేత ఇంతియాజ్





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 7)

గౌరవ డాక్టరేట్ పొందిన మదీనా వాచ్ అధినేత ఇంతియాజ్ మర్యాదపూర్వకంగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆయనను ఆత్మీయంగా సత్కరించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిని ఇంతియాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# డాక్టర్ సీతారామయ్యకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన విలేకరులు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 7)

ప్రముఖ వైద్య నిపుణులు, డి ఛానల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య పుట్టినరోజు సందర్భంగా మీడియా మిత్రులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు శ్రీనివాసరావు, ప్రతాప్, అశోక్, నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

# మిమిక్రీ పోటీలలో బుజ్జయ్యకు ప్రైజ్

(షణ్ముఖ వెలుగు, చేజర్ల, జనవరి 7)

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సాంస్కృతిక రాష్ట్ర స్థాయి (మెమిక్రీ) పోటీలలో సెకండ్ ప్రైజ్ సంపాదించి కాకినాడలో జరిగిన రాష్ట్ర మహాసభలో ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా చేజర్ల మండల కోశాధికారి బుజ్జయ్య షీల్డ్ అందుకున్నారు.



## ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఘనంగా కిశోరి వికాసం కార్యక్రమం

### సిడిపిఓ టి అరుణ





(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 7)

మండల కేంద్రమైన ఉలవపాడు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఉలవపాడు వెలుగు కార్యాలయంలో సిడిపిఓ టి.అరుణ అధ్యక్షతనలో మంగళవారం కిశోరి వికాసం కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ సింధు చాకిచెర్ల మెలికలు మెడికల్ ఆఫీసర్ కిశోరి బాలికలకు సంపూర్ణ ఆహారం ఆరోగ్యం గురించి వివరించారు. పి. వెంకటరమణయ్య మండల విద్యాశాఖ అధికారి కిశోరి బాలికలకు నాణ్యమైన విద్య మానవ అక్రమ రవాణా గురించి వివరించడం జరిగింది. సిడిపిఓ టి. అరుణ కిశోరి బాలికలకు ఆత్మరక్షణ మరియు వ్యక్తి రుతుస్రావ పరిశుభ్రత గురించి వివరించారు. కె .సాధన ఓ ఎస్ సి కేస్ వర్కర్ ఫోక్స్ యాక్ట్ , బాల్య వివాహాల చట్టాల గురించి , గుడ్ టచ్ ,బ్యాడ్ టచ్ గురించి తెలిపారు. సుభాషిని జూనియర్ కాలేజ్ లెక్చరర్ నైపుణ్యం ఉపాధి ,లింగ వివక్షత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ టి.అరుణ, ఎంఈఓ, మెడికల్ ఆఫీసర్స్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, ఉలవపాడు మండలం మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్వాడి కార్యకర్తలు, వన్ స్టాప్ సఖి సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామంలో డ్రైనేజీ కాలువల పూడికతీత కార్యక్రమం

(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 7)



మండల పరిధిలోని భీమవరం గ్రామంలోనీ వడ్డీపాలెంలో మంగళవారం గ్రామ సర్పంచ్ మేడిద రాజమ్మ, పంచాయతీ కార్యదర్శి ఏ. అంజయ్య ఆధ్వర్యంలో డ్రైనేజీలు పూడికతీత కార్యక్రమం నిర్వహించారు. గత కొన్ని రోజులు క్రితం వర్షాల ప్రభావంతో డ్రైనేజీల్లో నీరు నిల్వ



ఉండడంతో వీలుకాక గత నాలుగు రోజుల నుంచి డ్రైనేజ్ పూడికకు సంబంధించిన చెత్తాచెదారాన్ని తొలగించే ప్రక్రియను మొదలు పెట్టారు. గత కొన్ని రోజుల క్రితం దోమల నివారణకై దోమల మందు పిచికారి చేశారు. గ్రామంలోని పారిశుధ్యం పట్ల ప్రజల ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ చూపిస్తున్నందుకు పంచాయతీ సర్పంచి మేడిత రాజమ్మకు పంచాయతీ కార్యదర్శి ఏ. అంజయ్యకు ప్రజలు అభినందనలు తెలిపారు.

## కోడిపందాలు నిర్వహించకుండా చర్యలు

### జిల్లా కలెక్టర్ ఆనంద్



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 7)

సంక్రాంతి పండుగ నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా కూడా కోడిపందాలు నిర్వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరు వారి చాంబర్లో పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో జంతుహింస నివారణ చట్టం అమలుపై ఎగ్జిక్యూటీవ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు గ్రామాల్లో కోడిపందాలు నిర్వహించడం నేరమన్నారు. కోడిపందాలు జరగకుండా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లాస్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి కోడిపందాలు నిర్వహించకుండా చూడాలన్నారు. ఈ కమిటీల్లో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు సభ్యులుగా వుండి గ్రామాల్లో కోడిపందాలు, ఇతర ఘర్షణ వాతావరణం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు సూచించారు. ఈ సమావేశంలో పశు సంవర్థకశాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ నాయక్, ఏఎస్పీ సౌజన్య, డిఎఫ్ఓ మహబూబ్బాషా, జడ్పీ సీఈవో విద్యారమ, డిపివో శ్రీధర్రెడ్డి, ఏడి మాధవీలత, తదితరులు పాల్గొన్నారు.

# నగర సుందరీకరణ వైపు అడుగులు

ఫొటో నెం. 6 నుంచి 13 వరకు

### అందంగా, ఆకర్షణీయంగా ముస్తాబవుతున్న ఒంగోలు

### డివైడర్ల మధ్యలో జంతువుల బొమ్మల ఏర్పాటు

### ప్రజలను ఆకట్టుకుంటున్న బొమ్మలు

(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 7)

నగర సుందరీకరణ వైపు అడుగులు వేగంగా పడుతున్నాయి. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో నగర అభివృద్ధి పట్టించుకున్న దాఖలాలు లేవు. ఈ మేరకు టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు ఒంగోలు నగరం అందంగా కనిపించేందుకు మున్సిపల్ కమిషనర్ కే. వెంకటేశ్వరరావు, అలాగే అధికారులతో మాట్లాడి నగరంలో మార్పులు మొదలు పెట్టారు. ఇదిలా ఉంచితే ఎన్ క్యాప్ నిధులతో నగర సుందరీకరణకు కార్పొరేషన్ అధికారులు ప్రాధాన్యత ఇచ్చారు. అందులో భాగంగా ఇప్పటికే ప్రధాన రహదారుల్లో సెంటర్ డివైడర్లను, సైడ్ గోడలపై ఆకర్షించే రంగులతో అందంగా ముస్తాబు చేయగా, మరోవైపు సెంటర్ డివైడర్ల మధ్య పచ్చని మొక్కలు నాటించడంతోపాటు మధ్యలో అందమైన సీతాకోక చిలుకలు, గుర్రాలు, నెమలి బొమ్మలు ఏర్పాటు చేయడంతో ఒంగోలులోని ప్రధానమైన రోడ్లన్నీ డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన పక్షులు, జంతువులు, బొమ్మలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. ఈ నెలలో పండగలు ఉండడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి ఎంతోమంది సొంత ఊర్లకు రావడం జరుగుతుంది. వాళ్లందర్నీ ఆకర్షించే విధంగా నగరాన్ని సుందరీకరణ చేస్తున్నారు.










# బతికుండగానే రికార్డుల్లో చనిపోయినట్లుగా నమోదు

### పింఛను నిలిపివేత

### చీఫ్ విప్ జీవీ ఆంజనేయులును కలిసి న్యాయం చేయాలని కోరిన బాధితురాలు

(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 7)



వినుకొండలో దారుణం వెలుగు చూసింది. నిక్షేపంగా బతికి ఉన్న మహిళను చనిపోయినట్లుగా చూపించడం, బీమా డబ్బులు చెల్లించడం, అనంతరం పింఛను నిలిపివేయ డం ముక్కున వేలేసుకునేలా చేసింది. తాను జీవించే ఉన్న నెలలుగా పింఛను రాక, అవస్థలు భరించలేక బాధిత మహిళ ప్రభుత్వ చీఫ్విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులిని ఆశ్రయించడంలో వైకాపా ప్రభుత్వంలో జరిగిన విషయం బయటకు వచ్చింది. వివరాల్లోకి వెళితే వినుకొండ పట్టణం, సీతయ్య నగర్, వల్లపు శేషమ్మ 15 ఏళ్లుగా వితంతు పింఛను తీసుకుంటు న్నారు. పింఛనుడబ్బే ఆధారంగా జీవనం సాగిస్తున్నారు. కానీ 2023 అక్టోబర్ నుంచి ఆమెకు కష్టాలు మొదలయ్యాయి. అదే నెలలో బతికున్న శేషమ్మను చనిపోయినట్లుగా రికార్డుల్లో నమో దు అయింది. ప్రమాద బీమా పేరిట నామినీ ఖాతాలో డబ్బులు కూడా జమ చేశారు. తర్వాతి నెల నుంచి ఆమె పింఛను ఆగిపోయింది. అప్పట్నుంచి బాధిత మహిళ కన్నీటి పర్యంతం అవుతూ ఎంతమందితో కష్టం చెప్పుకున్నా పట్టించుకున్నవారు లేక పోయారు. చివరకు ఇటీవలే బాధిత మహిళ చీఫ్విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయుల్ని ఆశ్రయించడంతో వినుకొండ మున్సిపల్ కమిషనర్తో మాట్లాడిన చీఫ్విప్ జీవీ ఆమె చనిపోయినట్లుగా నమోదు కావడం, ప్రమాద బీమా జమ అన్నింటిపై విచారణ జరిపించాలని ఆదేశించారు. శేషమ్మకు న్యాయం చేయాలని, పింఛను పునరుద్ధరించాలని సూచించారు. ఈ మేరకు జీవీ ఆంజనేయుల్ని కలసిన బాధిత మహిళ శేషమ్మ చేసిన సాయానికి కృతజ్ఞతలు తెలిపారు. తనలా మరెవరీ అన్యాయం జరగకుండా చూడాలని వేడుకున్నారు.

# డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకు జన్మదిన శుభాకాంక్షలు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 7)

వెంకటరమణ నర్సింగ్ హోం అధినేత ప్రముఖ వైద్యులు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రకాశం జిల్లా కమ్మ వారి సేవాసంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కామేపల్లి సీతారామయ్య జన్మదిన సందర్భంగా ప్రకాశం జిల్లా కమ్మ సేవా సంఘం అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, సభ్యులు అందరూ కలిసి వారి నియమాసంలో జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# నెల్లూరు రెడ్ క్రాస్ చైర్మన్ పదవికి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి రాజీనామా


### సంస్థ ప్రతిష్ట దెబ్బ తినకూడదన్న ఆలోచనతో ఈ నిర్ణయం

### నెల్లూరు రెడ్ క్రాస్ పై మంత్రి నారాయణ చేస్తున్న కుట్రలతో సంస్థ ప్రతిష్ట దెబ్బ తినకూడదు

### ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 7)

నెల్లూరు రెడ్క్రాస్ చైర్మన్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి మీడియా సమావేశం నిర్వహించి సంచలన విషయాలను వెల్లడించారు. గత నాలుగేళ్లగా నెల్లూరు రెడ్ క్రాస్ ద్వారా పేద ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని రెడ్ క్రాస్ చైర్మన్ పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా నెల్లూరు రెడ్ క్రాస్ 13 ప్రాజెక్టులతో ప్రజలకు విశేష సేవలందిస్తుందని తెలిపారు. రెడ్ క్రాస్ చైర్మన్గా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రెడ్ క్రాస్ కమిటీ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేశామని తెలిపారు. కరోనా లాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా రెడ్ క్రాస్ ద్వారా ముందుకొచ్చి ప్రజలకు ఎన్నో సేవలు చేయడం జరిగిందన్నారు. రెడ్ క్రాస్ కమిటీ ద్వారా క్యాన్సర్ హాస్పిటల్ అభివృద్ధి, బ్లడ్ బ్యాంక్ ఆధునీకరణ, తల సేమియా క్లినిక్ ఏర్పాటు, రెడ్ క్రాస్ స్పాస్టిక్ సెంటర్లో మానసిక దివ్యాంగులైన చిన్నారులకు ఉచిత బస్సు, ఉచిత భోజన వసతి.. ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం మంత్రి నారాయణ రెడ్ క్రాస్ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అందుకు ప్రత్యక్ష ఉదాహరణ తానేనని పేర్కొన్నారు. నారాయణ హాస్పిటల్ వారికి అనుమతులు లేనప్పటికీ, రెడ్ క్రాస్ ద్వారా ఒప్పందం కుదుర్చుకోని, క్యాన్సర్ వైద్యశాల ఏర్పాటు చేయాలని భావించి తనను సంప్రదించారని తెలిపారు. నారాయణ హాస్పిటల్ వారికి క్యాన్సర్ హాస్పిటల్కు ఆరోగ్యశ్రీ అనుమతులు సంవత్సరం వరకు వచ్చే అవకాశం లేదని తెలిపారు. అందుచేత రెడ్క్రాస్ ద్వారా ఒప్పందం కుదుర్చుకొని, క్యాన్సర్ చికిత్స అందిస్తున్నట్లు చూపి ఆరోగ్యశ్రీ కోసం నారాయణ హాస్పిటల్ వారు సిద్ధపడ్డారని ఆరోపించారు. ఆ పై కుట్రలు చేసి నన్ను రెడ్ క్రాస్ చైర్మన్ పదవి నుంచి తొలగించాలని మంత్రి నారాయణ రాష్ట్ర కమిటీ నుంచి ఆగ మేఘాల మీద ఆర్డర్స్ తీసుకువచ్చారని తెలిపారు. అయితే వారు తీసుకొచ్చిన ఆర్డర్స్ రెడ్ క్రాస్లో ఎక్కడ చెల్లుబాటు కావని పేర్కొన్నారు. ఈ విషయంపై సోమవారం కలెక్టర్ని కలిసి రెడ్క్రాస్లో కొన్ని పనులు పెండింగ్లో ఉన్నాయని వాటిని పూర్తి చేసి జనవరి నెల చివరి నాటికి తానే స్వచ్ఛందంగా రెడ్ క్రాస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానని తెలియజేశానని చెప్పారు. అలాగేనని ఒప్పుకున్న కలెక్టర్ మంగళవారం సాయంత్రం మేనేజ్మెంట్ కమిటీతో సమావేశం నిర్వహించారన్నారు. తన వల్ల రెడ్ క్రాస్కు ఎలాంటి ఇబ్బంది రాకూడదు, రెడ్క్రాస్ ద్వారా పేద ప్రజలకు అందుతున్న సేవలు ఎక్కడ నిలిచిపోకూడదు అన్న ఉద్దేశంతో తాను రెడ్క్రాస్ చైర్మన్ పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. తన రాజీనామా పత్రాన్ని మంగళవారం సాయంత్రం మేనేజ్మెంట్ కమిటీకి అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను రాజీనామా చేసినప్పటికీ, రెడ్ క్రాస్కు పూర్తి సహాయ, సహకారాలు అందిస్తూ, రెడ్క్రాస్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు.




# చంద్రశేఖర్ రెడ్డికి మతిపోయింది



## మంత్రి నారాయణ పై వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలు అర్ధరహితం

## టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి

**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 7)**

ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డికి, ఆయన నాయకుడికి మైండ్ పోయిందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణా రెడ్డి ఆక్షేపించారు. మంత్రి నారాయణపై వైసీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి చేసిన ఆరోపణలకు ఆనం వెంకట రమణారెడ్డి కౌంటర్ ఇచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రశేఖర్ రెడ్డి రెడ్ క్రాస్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తూ నారాయణపై కట్టుకథలు అల్లారన్నారు. తనను రాజీనామా చేయాలని నారాయణ గన్ పెట్టినట్లు ఆరోపించారన్నారు. 2019 వరకూ చంద్రశేఖర్‌రెడ్డి అసలు రెడ్‌క్రాస్ మెంబర్ కూడా కాదు. అసలు రెడ్‌క్రాస్‌లో ఏం చేస్తారో కూడా తెలియదన్నారు. 2019లో మొదటిసారి మెంబర్ అయినప్పటి నుంచి ఇప్పటివరకూ ఒక్క చుక్క బ్లడ్ కూడా ఇవ్వలేదన్నారు. రెడ్ క్రాస్ నీ ఏదో ఉద్ధరించినట్లు మాట్లాడుతున్నాడు, చంద్రశేఖర్‌రెడ్డి గతం మర్చిపోయి మాట్లాడుతున్నాడు. చంద్ర శేఖర్ రెడ్డికి,ఆయన నాయకుడికి మైండ్ పోయిందన్నారు. నెల్లూరులో మొదటిసారి రెడ్ క్రాస్ న్యుబుస్థాపించింది రామచంద్ర నాయుడు,సీవీ సుబ్రమణ్యం అని తెలిపారు. రెడ్ క్రాస్ లో ఎప్పుడూ రాజకీయాలు లేవు, చంద్ర శేఖర్ రెడ్డి రెడ్ క్రాస్ చైర్మన్ ఎలా అయ్యాడు...అని ప్రశ్నించారు. మనోహర్ రెడ్డి ప్యానల్ గెలిస్తే వెన్నుపోటు పొడిచి ప్రెసిడెంట్ అయ్యావు అన్నారు. రెడ్ క్రాస్ ఎన్నికల్లో చంద్ర శేఖర్ రెడ్డి ప్యానల్ గెలవలేదన్నారు.మంత్రి నారాయణ గురించి లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని ఆరోపించారు. నెల్లూరు కోసం నారాయణ చేసిన మంచి కూడా ప్రజలకు చెప్పాలన్నారు. నారాయణ హాస్పిటల్ ద్వారా ప్రజలకు చేస్తున్న సేవ కూడా చెప్పాలన్నారు. నెల్లూరు టౌన్‌లో రెండు నెలలుగా పెద్ద నాయకుడిగా ఫీల్ అయిపోతున్నావు, నీ రాజీనామాకు నారాయణకి సంబంధం ఏంటి...? అన్నారు. రెడ్ క్రాస్ ఎంవోయూ అడిగితే తప్పేంట అన్నారు. నిన్ను బెదిరించాలని అనుకుంటే ఒక్క స్కూల్ కూడా నడపలేవని హెచ్చరించారు. నారాయణ ఎప్పుడూ మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేదని గుర్తు చేశారు. నారాయణని మీరు,జగన్ ఎలా ఇబ్బంది పెట్టాడో అందరికీ తెలుసున్నారు. చంద్ర శేఖర్ లాంటి బచ్చా గాళ్ళకు స్పాట్ పెట్టాల్సిన అవసరం మాకు లేదు, నెల్లూరు ప్రజలే చంద్రశేఖర్‌రెడ్డికి స్పాట్ పెడతారని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి స్పష్టం చేశారు.

# జాతీయస్థాయి ఏకపాత్రాభినయ పోటీల కరపత్ర ఆవిష్కరణ

## ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కే వెంకటేశ్వరరావు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 7)**

జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ఒంగోలు వారి ఆధ్వర్యంలో ప్రతినెల రెండో శనివారం జరుగుతున్న సాంస్కృతిక కార్యక్రమాల 91వ నెల (జనవరి 2025)కార్యక్రమాలకు సంబంధించి జాతీయస్థాయి ఏకపాత్రాభినయ పోటీల కరపత్ర ఆవిష్కరణను ఈరోజు ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ కే.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేది కళాకారులు అని తెలియజేశారు. అనంతరం కార్యక్రమం వివరాలను జిల్లా రంగభూమి సంఘ ప్రతినిధులు తెలియజేస్తూ 11వ తేదీ రెండవ శనివారం 4 గంటల నుండి ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఒంగోలులో జాతీయ స్థాయి ఏకపాత్రాభినయ పోటీలు (వీరబాహుడు, దుర్యోధనుడు, హరిచంద్ర) పాత్రలకు సంబంధించినటువంటి పోటీలు జరుగుతాయని అనంతరం రాత్రి 7 గం.లకు బహుమతి ప్రదాన సభ జరుగుతుందని ఈ సభలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ రావు, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి ఛైర్మెన్ మన ఒంగోలు వాసి పొడపాటి తేజశ్వి పాల్గొని, వీరి చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందించడం జరుగుతుంది అని , కావున కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రంగభూమి కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి అంగలకుర్తి ప్రసాద్ కోశాధికారి ధేనువకొండ సుబ్బయ్య సభ్యురాలు ఏల్చూరి అనంతలక్ష్మి, శేషరత్నం, వాకా సంజీవరెడ్డి, దిగ్విజయ్, యంవివిపి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

# బినామీ పట్టాలు రద్దుచేసి పేదలకు పంచాలి

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు



**(షణ్ముఖ వెలుగు, హనుమంతునిపాడు, జనవరి 7)**

మండలంలోని మిట్టపాలెం హాజీపురం ఉమ్మడి రెవెన్యూ పరిధిలో వేటపాలెం కారంచేడు చిన్నగంజాం బాపట్ల విజయవాడ హైదరాబాదు బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉన్న స్థానికేతర్ల పేరుతోటి ఉన్న 211 ఎకరాలు 54 మంది బినామీ పట్టాలను రద్దుచేసి పేదలకు పంచాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మిట్టపాలెం రెవిన్యూ సదస్సులు రెవెన్యూ తాసిల్దార్ హెచ్ఎంపాడు వారికి వినతి పత్రం స్థానిక పేదలు ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2002న నవంబర్ 14వ తేదీ హాజీపురం మిట్టపాలెం భూ కుంభకోణంపై ఆందోళన కార్యక్రమానికి ప్రారంభించడం జరిగిందని తెలిపారు. 2002 డిసెంబర్లో 9 మరియు 10 ,11 తేదీలలో నిరవదిక నిరాహార దీక్షలు చేపట్టడం జరిగిందన్నారు. అక్కడే వంటావార్పు పెట్టి తహసీల్దార్ కార్యాలయాన్ని బైఠాయింపు కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగిందన్నారు. అప్పటికి స్పందించకపోవడంతో 11వ తేదీ ఉదయం 10 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు అధికారులను ఆఫీసులో పెట్టి బయట తాళాలు వేసి ముట్టడించడం జరిగిందని తెలిపారు. నాటి ఆర్డిఓ కందుకూరు వారితోపాటు రెవెన్యూ అసోసియేషన్ తరపున రమణ హామీ మేరకు ముట్టడి కార్యక్రమాన్ని విరమించగా ఐదు మంది సర్వేర్లతోటి మిట్టపాలెం హాజీపురం ఉమ్మడి రెవెన్యూ పరిధిలో భూములన్నిటిని సర్వే చేయగా 419 ఎకరాల 43 సెంట్లు బినామీ పట్టా భూములు తేలాయని మరో 300 ఎకరాలు అసైన్మెంట్ ఏ డబ్ల్యూ భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉన్నట్లు సర్వే బృందం గుర్తించాలని తెలిపారు ఇందులో 310 ఎకరాల 40 సెంట్లు బినామీ పేర్లతోటి స్థానికేతర్లు ఈ జిల్లాలో ఈ రాష్ట్రంలోనూ లేని పేర్లతో పట్టాలు పొంది స్థానిక భూస్వాములు అక్రమంగా ఆక్రమించి సాగు చేసుకుంటున్న విషయాన్ని రెవెన్యూ అధికారులు గుర్తించి రద్దుకు ప్రపోజల్ పెడుతున్నామని హామీ ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు అయితే స్థానిక రాజకీయ పార్టీలు నాయకులు భూస్వాములకు తొత్తులుగా మారి అధికారులతోటి తమ అనుచరులకు సంబంధించినటువంటి బినామీ పట్టాలను బయటికి రాకుండా కుల, ధన రాజకీయ బలాలను ఉపయోగించి చివరికి 211 ఎకరాలను 2005లో రద్దు చేయుటకు నాటి రెవిన్యూ అధికారి కందుకూరు ఆర్డీవో గారికి హనుమంతునిపాడు మండలం ఎమ్మార్వో ఫైల్ ఫైనల్ చేసి పంపించారని నేటికీ ఆ భూములను రద్దు చేయలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు తక్షణమే బినామీ పట్టాలను రద్దుచేసి భూమిలేని స్థానిక పేదలకు పంపిణీ చేయాలని వీరు డిమాండ్ చేశారు ప్రభుత్వం స్పందించకుంటే పేదలతో మరో ప్రతిఘటన కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాచూటి పెద్దన్న, పెద్ద బాల గురవయ్య, రమణయ్య, స్థానిక పేదలు పాల్గొన్నారు.

# ముత్తుకూరులో అన్న క్యాంటీన్

## రూ.65 లక్షలు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, జనవరి 7)**

ముత్తుకూరులోని బస్టాండ్ సెంటరులో క్యాంటీన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. శిథిలావస్థలో ఉన్న ఆర్ అండ్ బీ అతిథి గృహానికి అదానీ కృష్ణపట్నం పోర్టు సీఎస్ఆర్ నిధులతో పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేస్తానని ప్రకటించారు సోమిరెడ్డి. తహసీల్దార్ కార్యాలయం వెనుక ప్రాంతంలో కృష్ణపట్నం శ్రీ సిద్ధేశ్వర, శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానాల నిధులతో కళ్యాణ మండపం నిర్మాణానికి స్థల పరిశీలించారు.

# మండల వైసీపీ కన్వీనర్ పదవికి పోటాపోటీ

## రేసులో దుద్దుగుంట మల్లికార్జున, కాటా మాధవరావు, గడ్డం మాల్యాద్రి







**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జనవరి 7)**

పొన్నలూరు మండల వైయస్సార్సీపి కన్వీనర్ పదవికి దుద్దిగుంట మల్లికార్జున్ రెడ్డి, కాటా మాధవ, గడ్డం మాల్యాద్రి రేసులో ఉన్నట్లు మండల వైఎస్ఆర్సిపి నాయకులు అనుకుంటున్నారు. గత వారం సింగరాయకొండ వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో కన్వీనర్ పదవికి మల్లికార్జున్ రెడ్డి, మాధవ, మాల్యాద్రి పేర్లను ప్రస్తావించగా కొండపి నియోజవర్గ ఇంచార్జ్ సురేష్ బాబు సమక్షంలో పొన్నలూరు మండలంలోని వైఎస్ఆర్ సీపీ నాయకులు జడ్పిటిసి, ఎంపీటీసీలు, సర్పంచులు కన్వీనర్ పదవిపై సురేష్ బాబు సమక్షంలో మంతనాలు జరిపారు, కన్వీనర్ పదవి ఎవరికి దక్కినోని మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. దుద్దిగుంట మల్లికార్జున రెడ్డి పెదరెడ్డిపాలెం గ్రామానికి చెందిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి , కాటా మాధవ చెరుకూరు గ్రామానికి చెందిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి, గడ్డం మాల్యాద్రి పొన్నలూర్ గ్రామానికి చెందిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి వీళ్ళ ముగ్గరిలో ఎవరికి మండల కన్వీనర్ వస్తుందని మండలంలోని వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. 2024లో జరిగిన ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి ఓటమి చందగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో కన్వీనర్ పదవికి పోటీకి గట్టిగా పోటీ లేకపోయినా అంతకు భిన్నంగా పొన్నాలు మండలంలో కన్వీనర్ పదవికి నేనంటే నేను అని రేసులో ఉన్నారు. ఇంకా కొన్ని రోజుల్లో కన్వీనర్ పదవి నియమించగా ఎవరికి వస్తుందని మండలంలోని వైసీపీ కార్యకర్తలు, నాయకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆధునిక పద్ధతులతో రైతులు మరిన్ని లాభాలు పొందచ్చు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 7)**

విజ్ఞానం పెంచుకొని ఆధునిక పద్ధతులు అవలంబించడం ద్వారా రైతులు మరిన్ని లాభాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా అన్నారు. సికింద్రాబాద్ లోని బొల్లారంలో ఉన్న రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న ' ఉద్యాన ఉత్సవం - 2025 ' విజ్ఞాన యాత్రలో పాల్గొనేందుకు జిల్లా నుంచి వెళ్తున్న రైతులతో కూడిన బస్సుకు మంగళవారం రాత్రి ప్రకాశం భవనం వద్ద ఆమె జండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రకు జిల్లా నుంచి మొత్తం 70 మంది రైతులు వెళుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ఈ సందర్భంగా కలెక్టరుకు వివరించారు. వీరు రెండు బస్సుల్లో తరలి వెళ్తున్నారని, ఒక బస్సు మార్కాపురంలో బయలుదేరి ఎర్రగొండపాలెం మీదుగా వెళుతుందని, మరో బస్సు ఒంగోలులో బయలుదేరి అద్దంకి మీదగా వెళుతుందని ఆయన చెప్పారు. అద్దంకి మీదగా వెళ్తున్న బస్సుకు ఈ సందర్భంగా కలెక్టర్ జెండా ఊపి రైతులకు వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు రమేష్, రామమోహన్ రావు, ఆత్మ పిడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కందులకు కృతజ్ఞతలు



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 7)**

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి మాదాలవారిపాలెం సొసైటీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ మండలపార్టీ అధ్యక్షులు యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన పై నమ్మకంతో పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తనను సొసైటీ అధ్యక్షునిగా





నియమించినందుకు ఎమ్మెల్యేకు రుణపడి ఉంటానన్నారు. ఎమ్మెల్యేకు ఎటువంటి చెడ్డపేరు రాకుండా రైతులకు తనకు చేతనైనంత వరకు మేలు చేసి వారి ఆర్ధికాభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు.

# పేకాట శిబిరం పై దాడి భారీగా నగదు స్వాధీనం



**(షణ్ముఖ వెలుగు, టంగుటూరు, జనవరి 7)**

పేకాట శిబిరంపై దాడి చేసి, 17 మందిని అదుపులోకి వారి వద్ద నుండి రూ.3,62,730 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తెలిపారు. టంగుటూరు మండల పరిధిలోని తూర్పు నాయుడుపాలెం గ్రామం శివారులో గూడెం నందు పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ నాగమల్లేశ్వరరావు తమ సిబ్బందితో దాడి చేసి 17 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.3,62,730 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పేకాట కోడి పందాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని టంగుటూరు మండల పరిధిలోని పేకాట కోడి పందాలు నిర్వహిస్తే స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని ఇచ్చిన ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com